TELANGANA SHASANA SABHA TELTEL/2016/68867

తెలంగాణ
# శాసనసభ

ఎడిటర్ : పోలగోని రాజేష్
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను...**

తెలంగాణ రాష్టంలో తెలంగాణ శాసనసభ తెలుగు దినపత్రికకు రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తిగల, అనుభవం కలిగిన అభ్యర్థులు కావలెను..

తెలంగాణ శాసనసభ తెలుగు దినపత్రిక నెట్వర్క్ ఇంచార్జ్
పి.వెంకటేష్
9949360937,9100900931

Published from Hyderabad, Rangareddy, Nalgonda, Mahabubnagar, Khammam సంపుటి : 2 సంచిక : 88 పేజీలు : 8 సోమవారం 2 సెప్టెంబర్ 2024 వెల : 4/-

# హైడ్రానా

## బ్రాండ్ ఇమేజ్ కోసమే



**రేవంత్ లెక్కేంటో...**

- నిన్నమొన్నటి వరకు హైడ్రా అంటే అంత పెద్దగా ఎవరికీ తెలియదు
- హైడ్రా కమిషనర్గా పోలీస్ ఆఫీసర్ రంగనాథ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత హైడ్రా అంటే హైదరాబాద్ లోని చెరువు భూములు ఆక్రమించిన బడాబాబులు అదిరిపోతున్నారు.
- తన కుటుంబ సభ్యులైనా, స్వంత పార్టీ వారైనా, వీఐపీలయినా సరే చెరువు ఎఫ్. టీ.ఎల్ లో లేదా బఫర్ జోన్లో కట్టడాలు నిర్మిస్తే కూల్చక తప్పదని వార్నింగ్

హైదరాబాద్

హైడ్రా ఇప్పుడు తెలంగాణలో హాట్ హాట్ న్యూస్. నిన్నమొన్నటి వరకు హైడ్రా అంటే అంత పెద్దగా ఎవరికీ తెలియదు. హైడ్రా కమిషనర్ గా పోలీస్ ఆఫీసర్ రంగనాథ్ బాధ్యతలు చెపట్టిన తర్వాత హైడ్రా అంటే హైదరాబాద్ లోని చెరువు భూములు ఆక్రమించిన బడాబాబులు అదిరిపోతున్నారు. హైడ్రా అంటే హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ మానిటరింగ్ అండ్ ప్రోటెక్షన్ ఎజెన్సీ ఈ ఏజెన్సీ ఇప్పుడు ఇంతగా బలోపేతం అవడానికి, దూకుడుగా పని చేయడం వెనుక రాజకీయ కారణాలున్నాయా ? అన్న చర్చ సాగుతోంది. ఎందుకంటే - మిగతా3లో

# అప్రమత్తంగా ఉండాలి



- భారీ వర్షాలతో వచ్చిన వరద నీటిని వృథా చేయకుండా భవిష్యత్తు అవసరాలకు వినియోగించుకోవాలి
- భారీ వర్షాల వేళ ఇరిగేషన్ శాఖ అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు
- ప్రాజెక్టుల పరిధిలోని రిజర్వాయర్లు, చెరువులు కుంటల్లో నీటిని నిల్వ చేయాలని
- కొండపోచమ్మ సాగర్ నుంచి హల్దీ వాగు ద్వారా నిజాంసాగర్ ప్రాజెక్టుకు నీటిని తరలించాలి
- నంది, గాయత్రి పంప్ హౌస్ల ద్వారా లిఫ్ట్ చేసి రిజర్వాయర్లు నింపాలి

హైదరాబాద్

తెలుగు రాష్ట్రాలను భారీ వర్షాలు దంచికొడుతున్నాయి. వరదలు ముంచెత్తున్నాయి. దాదాపు చెరువులన్నీ నిండిపోగా.. నదులు, వాగులు, వంకలు వరదలతో ఉప్పొంగుతున్నాయి. ముఖ్యంగా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో వరద పరిస్థితులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షించారు. భారీ వర్షాలతో వచ్చిన వరద నీటిని వృథా చేయకుండా భవిష్యత్తు అవసరాలకు వినియోగించుకోవాలంటూ ఇరిగేషన్ అధికారులను సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. ప్రాజెక్టుల పరిధిలోని రిజర్వాయర్లు, చెరువులు కుంటల్లో నీటిని నిల్వ చేయాలని సూచన చేశారు. ఎగువన కురిసిన వర్షాలతో పాటు కడెం నుంచి వస్తున్న వరదతో పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నిండింది. దీంతో ఎల్లంపల్లి గేట్లు - మిగతా3లో



# మరో డీఎస్సీకి సన్నాహాలు

- 11,062 పోస్టుల భర్తీకి ఇటీవల డీఎస్సీ పరీక్ష నిర్వహించిన ప్రభుత్వం
- డిసెంబర్/జనవరిలో నోటిఫికేషన్ జారీ చేసి జూన్-జులైలోపు నియామకాలు పూర్తి చేయాలని భావిస్తున్నట్లు సమాచారం.
- ఆలోపు టెట్ కూడా నిర్వహించే అవకాశం ఉంది
- ప్రస్తుత డీఎస్సీతో ఎంతమంది ఉపాధ్యాయులు భర్తీ అవుతారు? ఇంకా ఎన్ని ఖాళీలుంటాయనే సమాచారాన్ని జిల్లాల వారీగా సేకరిస్తోంది.

హైదరాబాద్

తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో 11,062 పోస్టుల భర్తీకి ఇటీవల డీఎస్సీ పరీక్ష నిర్వహించిన ప్రభుత్వం మరో డీఎస్సీకి కసరత్తు చేస్తోంది. డిసెంబర్/జనవరిలో నోటిఫికేషన్ జారీ చేసి జూన్-జులైలోపు నియామకాలు పూర్తి చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఆలోపు టెట్ కూడా నిర్వహించే అవకాశం ఉంది. ప్రస్తుత డీఎస్సీతో ఎంత మంది ఉపాధ్యాయులు భర్తీ అవుతారు? ఇంకా ఎన్ని ఖాళీలుంటాయనే - మిగతా3లో

# 11 జిల్లాల్లో రెడ్ అలెర్ట్..
# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



- భారీ వర్షాల వల్ల ఏ విధమైన ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- తెగిపోయేందుకు అవకాశం ఉన్న చెరువులు, కుంటలకు తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలి
- ఎక్కడా ఏ చిన్న ఇబ్బంది జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలి
- రాష్ట్ర ఆర్ అండ్ బీ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

హైదరాబాద్

తెలంగాణ వ్యాప్తంగా రెండు రోజుల పాటు అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో భారీ వర్షాల వల్ల ఏ విధమైన ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ఆర్ అండ్ బీ యంత్రాంగాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అప్రమత్తం చేశారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో11 జిల్లాలల్లో రెడ్ అలెర్ట్ జారీ చేసిన నేపథ్యంలో ఆయా జిల్లాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. తెగిపోయేందుకు అవకాశం ఉన్న చెరువులు, కుంటలకు తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిరంతరం అధికారులతో టెలిఫోన్లో మాట్లాడుతూ చేపట్టాల్సిన సహాయక చర్యలపై సూచనలు చేస్తున్నారు. ఎక్కడా ఏ చిన్న ఇబ్బంది జరగకుండా - మిగతా3లో

## రేవంత్ రెడ్డి గారి కాన్సెప్ట్ ఇప్పటికైనా అర్థమైందా?

- హైదరాబాదులో అక్రమ నిర్మాణాలపై హైడ్రా ఉక్కుపాదం
- రేవంత్ రెడ్డి నిర్ణయం సాహసోపేతమన్న నాగబాబు
- ఆయన చర్యలను అందరూ అభినందించాలంటూ ట్వీట్

# స్టే సేఫ్ తెలంగాణ



- వరదల పరిస్థితిని అదుపు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది
- తప్పనిసరైతే తప్ప బయటకు వెళ్లొద్దు: కేటీఆర్
- చిన్నారులు, వృద్ధులను జాగ్రత్తగా చూసుకోవాలి
- బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్

స్టే సేఫ్ తెలంగాణ.. భారీ వర్షాల నేపథ్యంలో తెలంగాణ ప్రజలకు, పార్టీ శ్రేణులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. తప్పనిసరి అయితే తప్ప, దయచేసి బయటికి వెళ్లొద్దని సూచించారు. చిన్నారులు, వృద్ధులను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. తాత్కాలిక నిర్మాణాలు, పాడుబడ్డ భవనాలకు దూరంగా ఉండాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని, సహాయ చర్యల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. వరద ప్రభావిత ప్రజలకు సహాయం చేయాలని ఎక్స్ వేదికగా సూచించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో - మిగతా3లో

# టీఎంసీకి ఎదురుదెబ్బ.. అసోం పార్టీ అధ్యక్షుడు రాజీనామా

తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి అసోంలో ఎదురుదెబ్బ తగిలింది. అసోం టీఎంసీ పార్టీ అధ్యక్షుడు రిపున్ బోరా ఆదివారం పార్టీకి రాజీనామా చేశారు. అసోం ప్రజలు టీఎంసీని పశ్చిమ బెంగాల్‌లోని 'ప్రాంతీయ పార్టీ'గా పరిగణిస్తున్నారని, కానీ అసోంలో తమ పార్టీగా అంగీకరించడానికి ఇష్టపడటం లేదని ఆయన అన్నారు. అంతేకాదు అసోంలో టీఎంసీకి ఆమోద యోగ్యంగా ఉండాలని పార్టీ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి పలు సూచనలు చేశామని గుర్తు చేశారు. అయినప్పటికీ వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీకి రాసిన లేఖలో రిపున్ బోరా స్పష్టం చేశారు.



**పట్టించుకోలేదు**

జాతీయ స్థాయిలో అస్సామీ నేతను చేర్చుకోవాలని, కోల్‌కతాలోని టోలీగంజ్‌లోని భారతరత్న డాక్టర్ భూపేన్ హజారికా నివాసాన్ని వారసత్వ ప్రదేశంగా ప్రకటించాలని కోరినట్లు తెలిపారు. కూచ్ బెహార్‌లోని మధుపూర్ సత్రాన్ని సాంస్కృతిక కేంద్రంగా మార్చాలని కూడా సూచించినట్లు తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు గత ఏడాదిన్నర కాలంగా అభిషేక్ బెనర్జీ, మమతా బెనర్జీలను కలవాలని ప్రయత్నించినా సఫలం కాలేదని రిపున్ బోరా తెలిపారు. రెండేళ్లకు పైగా టీఎంసీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న ఆయన ఈ సమయంలోనే రాష్ట్రవ్యాప్తంగా ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని పునరావృత సమస్యలు మా పురోగతికి ఆటంకం కలిగిస్తున్నాయన్నారు.

**అనేక సార్లు సూచనలు**

మాజీ రాజ్యసభ సభ్యుడు, అసోంలో టీఎంసీకి ఆమోదయోగ్యంగా ఉండాలని పార్టీ అధిష్టానానికి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి అనేక సూచనలు ఇచ్చామన్నారు. కానీ అవి కూడా అమలు కాలేదని చెప్పారు. తాను రెండేళ్లకు పైగా అసోం టీఎంసీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశానని, ఈ కాలంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలతో విస్తృతంగా సంభాషించానని చెప్పారు. దురదృష్టవశాత్తూ అనేక అంశాల పెండింగ్ నేపథ్యంలో అసోంలోని చాలా మంది ప్రజలు %ువీజ%ని పశ్చిమ బెంగాల్ ప్రాంతీయ పార్టీగా చూడడానికి దారితీశాయన్నారు. ఈ క్రమంలో అసోం ప్రజలు వేరే రాష్ట్రానికి చెందిన పార్టీని అంగీకరించడానికి ఇష్టపడటం లేదన్నారు. అనేక సవాళ్లకు తగిన పరిష్కారం లేకపోవడంతో తాను ఈ కఠినమైన నిర్ణయం తీసుకోవలసి వచ్చిందన్నారు.

# పశ్చిమ బెంగాల్‌లో మరో దారుణం

**కోల్‌కతా :** కోల్‌కతాలోని ఆర్ జి కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ట్రైయినీ వైద్యురాలిపై హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీంతో దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. దాంతో స్థానిక కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు అన్ని కోర్టులు ఈ అంశంలో జోక్యం చేసుకున్నాయి. అలాంటి వేళ.. కోల్‌కతాలోని ఓ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న ఓ నర్సు పట్ల చికిత్స తీసుకుంటున్న వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించాడు. దాంతో ఆసుపత్రి వైద్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.




పోలీసులు కేసు నమోదు చేసి అతడిని అరెస్ట్ చేశారు. ఈ ఘటన పశ్చిమ బెంగాల్‌లోని బీర్భుం జిల్లాలోని ఇలంబజార్ ఆరోగ్య కేంద్రంలో చోటు చేసుకుంది. తీవ్ర జర్వంతో బాధపడుతున్న వ్యక్తిని అతడి కుటుంబ సభ్యులు శనివారం రాత్రి ఇలాంబజార్ ఆరోగ్య కేంద్రానికి తీసుకు వచ్చారు. అతడికి అత్యవసర చికిత్స అందించే క్రమంలో.. సలైన్ పెట్టేందుకు నర్సు యత్నించింది. ఆమె పట్ల అతడు అసభ్యకరంగా ప్రవర్తించాడు. అంతే కాకుండా ఆమెను తీవ్రంగా దూషించాడు.

చికిత్సకు సహకరించేలా చూడాలంటూ అతడి కుటుంబ సభ్యులకు నర్స్ సూచించింది. అయినా అతడి ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ విషయాన్ని ఆమె ఆసుపత్రి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లింది. వెంటనే వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి అతడిని అరెస్ట్ చేశారు. ఈ విషయంపై ఆసుపత్రి నర్స్ స్పందించారు. ఆసుపత్రిలో తమకు భద్రతే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అతడు.. తన కుటుంబ సభ్యుల సమక్షంలో ఈ విధంగా వ్యవహరించమే అందుకు కారణమన్నారు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యుడు డాక్టరు మసిదుల్ హసన్ మాట్లాడారు. చోటాచక్ గ్రామానికి చెందిన అబ్బాస్ ఉద్దీన్ తీవ్ర జర్వంతో ఆసుపత్రికి వచ్చాడని తెలిపారు. చికిత్స అందించే క్రమంలో నర్స్ పట్ల అతడు అసభ్యకరంగా ప్రవర్తించాడన్నారు. దీంతో ఇలంబజార్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. అతడిని వారు అరెస్ట్ చేశారని చెప్పారు.

# వందే భారత్ స్లీపర్ కోచ్‌లను రిలీజ్ చేసిన మంత్రి

దేశంలో త్వరలోనే స్లీపర్ వందే భారత్ రైళ్లు ప్రారంభం కానున్నాయి. ఈ రైలు దేశంలోని వివిధ రైల్వే మార్గాల్లో ప్రయాణించనుంది. ఈ క్రమంలోనే కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ నేడు(సెప్టెంబర్ 1న) బెంగళూరులోని ప్రొడక్షన్ యూనిట్‌ని సందర్శించి అక్కడ వందే భారత్ స్లీపర్ ట్రైన్ సెట్ ఉత్పత్తిని పరిశీలించారు. ఆ క్రమంలో బీఈఎంఎల్ ఫెసిలిటీలో వందే భారత్ స్లీపర్ కోచ్‌కు సంబంధించిన ప్రోటోటైప్ వెర్షన్‌ను ఆవిష్కరించారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి కోచ్‌ల గురించి కీలక విషయాలను వెల్లడించారు. వందే భారత్ స్లీపర్ రైలు రూపకల్పన, లోపలి భాగం చాలా ఆకర్షణీయంగా ఉందని, అందులో ప్రపంచ స్థాయి సౌకర్యాలు ప్రయాణీకులకు అందించబడుతున్నాయని తెలిపారు.



**సౌకర్యాలు, సెఫ్టీ**

వందే భారత్ స్లీపర్ రైలు.. సౌకర్యం, భద్రత, సామర్థ్యం పరంగా కొత్త ప్రమాణాలను ఏర్పాటు చేస్తుందని రైల్వే మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. ఈ రైలులో యుఎస్‌బీ ఛార్జింగ్, పబ్లిక్ ప్రకటనలు, దృశ్య సమాచార వ్యవస్థ, ఇన్‌సైడ్ డిస్ప్లే ప్యానెల్లు, సెక్యూరిటీ కెమెరాలు, మాడ్యులర్ ప్యాంట్రీతోపాటు ఇంటిగ్రేటెడ్ రీడింగ్ లైట్లు ఉన్నాయి. ఇంకా వికలాంగ ప్రయాణికుల కోసం ప్రత్యేక బెర్త్‌లు, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. మొదటి %ూజ% కంపార్ట్‌మెంట్‌లో ప్రయాణికులకు హాట్ వాటర్ షవర్ సౌకర్యం కూడా అందించబడుతుంది.

**వందే భారత్ స్లీపర్ రైలులో ఉన్న సౌకర్యాలు**

ప్యానెల్స్‌తో క్లాస్ ఇంటీరియర్
ఏరోడైనమిక్ బాహ్య రూపం
మాడ్యులర్ చిన్నగది
వికలాంగులకు ప్రత్యేక బెర్త్‌లు, మరుగుదొడ్లు
ఆటోమేటిక్ తలుపులు
సెన్సార్ ఆధారిత ఇంటర్ కమ్యూనికేషన్ డోర్
చివరి గోడపై రిమోట్‌గా పనిచేసే ఫైర్ బారియర్ తలుపులు
లోకో పైలట్ కోసం టాయిలెట్
ఫస్ట్ క్లాస్ %ూజ%లో వేడి నీటి షవర్లు
ఛార్జింగ్ సదుపాయంతో ఇంటిగ్రేటెడ్ రీడింగ్ లైట్
బహిరంగ ప్రకటన, దృశ్య సమాచార వ్యవస్థ
పెద్ద లగేజీ సౌకర్యం గది

**ఛార్జీలు**

వందేభారత్ రైలు డిజైన్‌ను మెరుగుపరుస్తున్నామని, అనుభవాల నుంచి నేర్చుకుని దాన్ని మరింత మెరుగుపరుస్తున్నామని కేంద్ర మంత్రి తెలిపారు. వందేభారత్ మెట్రోకు కూడా ఇదే సూత్రాన్ని అవలంబిస్తామని అశ్విని వైష్ణవ్ అన్నారు. 16 కోచ్‌లతో కూడిన వందే భారత్ స్లీపర్ రైలు 800 నుంచి 1200 కి.మీ ప్రయాణిస్తుందన్నారు. ఈ రైలులో ఆక్సిజన్ స్థాయిలు, వైరస్ రక్షణ వంటి అదనపు ఫీచర్లు కూడా ఉన్నాయన్నారు. ఈ రైలు మధ్యతరగతి ప్రజల కోసం ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో దీని ఛార్జీలు రాజధాని ఎక్స్‌ప్రెస్‌తో సమానంగా ఉంటాయన్నారు. తదుపరి పరీక్షల కోసం ఈ రైలు ట్రాక్‌లోకి తీసుకెళ్లడానికి ముందు 10 రోజుల్లో పరీక్ష చేయించుకోవాలని కేంద్ర మంత్రి అధికారులకు తెలిపారు. వచ్చే మూడు నెలల్లో ఈ రైలు ప్రయాణికులకు అందుబాటులోకి వస్తుందని మంత్రి తెలిపారు.

**మూడు వెర్షన్లు**

వందే భారత్ రైలులో మూడు వెర్షన్లు ఉన్నాయి. చైర్ కార్, స్లీపర్, మెట్రో. ఇప్పటివరకు ప్రభుత్వం వందే భారత్ రైళ్లకు చైర్ కార్ వెర్షన్‌ను ప్రారంభించింది. వందేభారత్ స్లీపర్ కోచ్ నిర్మాణాన్ని తాజాగా ఆవిష్కరించారు. ఈ వందే భారత్ స్లీపర్ కోచ్‌ల దృష్టి ప్రయాణికుల సౌకర్యాలపైనే ఉందని కేంద్ర మంత్రి తెలిపారు. ముందుగా ఐదు నుంచి ఆరు నెలల పాటు ట్రైన్‌సెట్‌ను పరీక్షిస్తామని, ఆ తర్వాతే ప్రారంభిస్తామని అశ్విని వైష్ణవ్ తెలిపారు. స్లీపర్ రైలు కూడా చైర్ కార్ మాదిరిగానే అదే సాంకేతికతపై ఆధారపడి ఉంటుందన్నారు. కాబట్టి ఇది శబ్దం లేని ప్రయాణాన్ని అందిస్తుందన్నారు.

## బాలికపై లైంగిక వేధింపులు.. బీజేపీ నేత అరెస్ట్, పార్టీ నుంచి బహిష్కరణ

**డెహ్రాడూన్:** బీజేపీ నేత ఒక బాలికను లైంగికంగా వేధించాడు. అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న ఆ బీజేపీ నేతను అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో ఆయనను పార్టీ నుంచి బీజేపీ బహిష్కరించింది. ఉత్తరాఖండ్‌లోని అల్మోరా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆగస్ట్ 24న సోదరులతో కలిసి మేకలు మేపేందుకు వెళ్లిన 14 ఏళ్ల కుమార్తెకు బీజేపీ బ్లాక్ అధ్యక్షుడు భగవత్ సింగ్ బోరా చాకెట్లు ఇచ్చాడని, బాలికను లైంగికంగా వేధించాడని, అసభ్యకరంగా ప్రవర్తించాడని ఆమె తల్లి ఆరోపించింది. ఆగస్ట్ 30న పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. కాగా, కోర్టు, వైద్యులు, శిశు సంక్షేమ కమిటీ (సీడబ్ల్యూసీ) ఎదుట ఆ బాలిక స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారు. ఈ నేపథ్యంలో బీజేపీ నేత భగవత్ సింగ్ బోరాపై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న ఆయనను శనివారం రాత్రి అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు. మరోవైపు ఈ సంఘటన దురదృష్టకరమని బీజేపీ పేర్కొంది. భగవత్ సింగ్ బోరాను పార్టీ నుంచి బహిష్కరించినట్లు వెల్లడించింది. 'పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి నిందితుడ్ని తొలగించాం.

## హైదరాబాద్ వస్తున్న ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు..!




మధ్యప్రదేశ్ జబల్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరిన ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడంతో ఆదివారం నాగ్‌పూర్‌కు దారి మళ్లించారు. విమానంలో బాంబు బెదిరింపు కారణంగా జబల్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరిన 6ఈ-7308 విమానం ఆదివారం ఉదయం నాగ్‌పూర్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మళ్లించామని ఎయిర్‌లైన్ పేర్కొంది. నాగ్‌పూర్‌లో విమానం ల్యాండ్ అయిన తర్వాత, ప్రయాణికులను దింపివేసి.. ఆ తర్వాత తనిఖీలు నిర్వహించినట్లు చెప్పింది. విమానంలోని వాష్‌రూమ్‌లో పేపర్‌పై బాంబు బెదిరింపు పేపర్ లభ్యమైందని పోలీసులు తెలిపారు. భద్రతా సంస్థలు విమానం మొత్తాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశాయని, అనుమానాస్పదంగా ఏమీ కనిపించలేదన్నారు. ఆ తర్వాత అదే విమానంలో ప్రయాణికులను గమ్యస్థానానికి తరలించనున్నట్లు ఆ అధికారి తెలిపారు. ఈ నెల 22న ముంబయి ఎయిర్ ఇండియా విమానానికి బాంబు బెదిరింపు వచ్చిన విషయం తెలిసిందే. దాంతో విమానాన్ని తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి తరలించి.. ఎయిర్‌పోర్ట్‌లో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే ఎమర్జెన్సీని ఎత్తివేశారు. విమానంలోని టాయిలెట్‌లో టిష్యూ పేపర్‌పై 'ఫ్లైట్‌లో బాంబు ఉంది' అనే సందేశం కనిపించింది. 22న ముంబయి నుంచి తిరువనంతపురం వెళ్తుండగా ఎయిర్ ఇండియా విమానం %ూ×%657లో హెచ్చరిక పేపర్ గుర్తించినట్లు ఎయిర్ ఇండియా ప్రతినిధి ఒకరు తెలిపారు.

## రేవంత్ రెడ్డి గారి కాన్సెప్ట్ ఇప్పటికైనా అర్థమైందా?



హైదరాబాదులో అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేస్తూ 'హైడ్రా' కదం తొక్కుతున్న సంగతి తెలిసిందే. దీనిపై సినీ నటుడు, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు స్పందించారు. వర్షాలు పడి తూములు తెగిపోయి, చెరువులు, నాలాలు ఉప్పొంగి అపార్ట్‌మెంట్ లలోకి కూడా నీళ్లు రావడం, కొన్ని సామాన్య ప్రాణాలు కూడా బలికావడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. అందుకు ముఖ్య కారణం చెరువులను, నాలాలను కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేయడమేనని నాగబాబు స్పష్టం చేశారు. "తెలంగాణ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు చేపట్టిన హైడ్రా కాన్సెప్ట్ ఇప్పటికైనా అర్థమైందా? రేవంత్ రెడ్డి గారు తీసుకున్న సాహసోపేత నిర్ణయాన్ని, నిబద్ధతతో కూడిన చర్యలను మనమందరం అభినందిద్దాం. రేవంత్ రెడ్డి గారూ... మా సంపూర్ణ సహకారం మీకే" అంటూ నాగబాబు సోషల్ మీడియాలో స్పందించారు.

## మణిపూర్‌లో కాల్పులు..

**మహిళ మృతి, ఆమె కుమార్తె ఇద్దరు పోలీసులకు గాయాలు**



**ఇంఫాల్:** మణిపూర్‌లో అనుమానిత తిరుగుబాటుదారులు కాల్పులు జరిపారు. ఈ సంఘటనలో ఒక మహిళ మరణించింది. 12 ఏళ్ల ఆమె కుమార్తెతోపాటు ఇద్దరు పోలీసులు కూడా గాయపడ్డారు. కుకీ తీవ్రవాదులు ఆ మహిళను కాల్చి చంపినట్లు మైతీలు ఆరోపించారు. అలాగే ఒక ఇంటిపై డ్రోన్ ద్వారా బాంబు దాడి జరిగినట్లు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో కుకీల ఆధిపత్యం ఉన్న కాంగ్‌పోక్పిలోని నఖుజాంగ్ గ్రామం నుంచి మైతీల ఆధిపత్యం ఉన్న ఇంఫాల్ వెస్ట్‌లోని కదంగ్‌బండ్ వైపు కాల్పులు జరిగాయి. దీంతో కదంగ్‌బండ్ నుంచి కూడా కాల్పులు ప్రారంభమయ్యాయి. కాగా, కాల్పుల్లో గాయపడిన కదంగ్‌బండ్‌కు చెందిన 31 ఏళ్ల నగాంగ్‌బామ్ సుర్బాలా అనే మహిళను ఇంఫాల్‌లోని రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)కు తరలించారు. అయితే ఆమె అప్పటికే మరణించినట్లు డాక్టర్లు తెలిపారు. కుకీ ఉగ్రవాదులు ఆ మహిళను హతమార్చారని మైతీలు ఆరోపించారు. అయితే కాంగ్‌పోక్పిలోని కుకీ గ్రామాలపై మైతీలు తొలుత కాల్పులు జరిపినట్లు కుకీ తెగకు చెందిన వారు సోషల్ మీడియాలో కౌంటర్ ఆరోపణలు చేశారు. మరోవైపు ఇరువైపులా కాల్పులు జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ కాల్పుల్లో ఇద్దరు పోలీసులు కూడా గాయపడినట్లు చెప్పారు. అయితే గాయపడిన పోలీసులకు ఎలాంటి ప్రమాదం లేదని వెల్లడించారు. కాగా మణిపూర్‌లోని మెజారిటీ వర్గమైన మైతీలకు రిజర్వేషన్ కల్పించడాన్ని మైనారిటీ వర్గమైన కుకీలు వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో 2023 మే నుంచి ఈ రెండు జాతుల మధ్య ఘర్షణలు, పోరాటాలు జరుగుతున్నాయి. దాడులు, ప్రతి దాడుల్లో వందలాది మంది మరణించగా వేలాది మంది నిరాశ్రులయ్యారు.

## 1962 ఇండో-చైనా యుద్ధం నాటి మోర్టార్ స్మోక్ బాంబు లభ్యం..?

భారత్-చైనా దేశాల మధ్య 1962లో జరిగిన యుద్ధం సమయంలో చైనా వినియోగించిన మోర్టార్ స్మోక్ బాంబు అస్సాంలో లభ్యమైంది. ఇది చైనాలో తయారు చేసిన బాంబు అని సోనిత్ పూర్ ఎస్పీ తెలిపారు. 1962 యుద్ధంలో ఈ బాంబును దట్టమైన పొగను వ్యాపింపజేయడానికి ఉపయోగించినట్లు చెప్పారు. అస్సాంలోని సోనిత్ పూర్ జిల్లాలో ఈ మోర్టార్ స్మోక్ బాంబును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జౌగాపూర్ గ్రామంలో శుక్రవారం సాయంత్రం సేసా నదిలో ఓ వ్యక్తి చేపల వేటకు వెళ్లాడు. నదిలో రెండు అంగుళాల పొడవు కలిగిన పేలుడు పదార్థాన్ని గుర్తించాడు. దానిని బయటకు తీసుకొచ్చాడు. ఈ విషయాన్ని స్థానిక మిషనరీ పోలీస్ స్టేషన్‌లో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు అతని వద్దకు చేరుకుని స్మోక్ బాబును స్వాధీనం చేసుకున్నారు. సోనిత్ పూర్ ఎస్పీ బరున్ పుర్కాయస్త ఇచ్చిన సమాచారం మేరకు ఆర్మీ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. లెఫ్టినెంట్ కల్నల్ అభిజిత్ మిశ్రా నేతృత్వంలోని మిసామరి క్యాంప్‌కు చెందిన ఆర్మీ బృందం ఆ మోర్టార్ స్మోక్ బాంబును ధ్వంసం చేసింది. ఈ మోర్టార్ స్మోక్ బాంబు ఒక రకమైన మందుగుండు సామాగ్రి. శత్రువుల కాల్పులను నివారించడానికి, శత్రువుల నిఘా నుంచి తప్పించుకోవటానికి ఈ స్మోక్ బాంబును వినియోగించేవారని ఎస్పీ తెలిపారు.

# స్టేట్ సేఫ్ తెలంగాణ..

-మొదటిపేజీ తరువాయి

రెండు రాష్ట్రాల్లోనూ కురుస్తున్న వర్షాల కారణంగా వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. జన జీవితాన్ని తీవ్ర ఇబ్బందుల పాలు చేస్తున్నాయి. ఖమ్మం జిల్లాలో వర్షాలకు వరదగా వరద పోటెత్తుతోంది. మున్నేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వాగు పరివాహకంలోని 15 కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. కాలనీలు నీటమునగడంతో బాధితులు ఇళ్ల పైకి చేరుకున్నారు. బయటకు వెళ్లేందుకు అవకాశం లేకుండాపోవడంతో ఇళ్ల పైకి చేరుకుని రక్షించాలంటూ ఆర్తనాదాలు చేస్తున్నారు.

ఖమ్మం జిల్లాలో నెలకొన్న పరిస్థితిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు స్పందించారు. - రాష్ట్రవ్యాప్తంగా వరదల పరిస్థితిని అదుపు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఖమ్మంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా సరే ప్రజలకు ఏమాత్రం ఉపయోగం లేదు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో విసిగిపోయిన



ప్రజలు ఖమ్మంలోని త్రీ టౌన్ ప్రాంతంలో వీధుల్లో నిరసనకు దిగారు. కనీస సాయం కోసం వరదల సమయంలో ప్రజలు ఇలా ఆందోళన చేయడం అంటే ప్రభుత్వం ఎంత ఉదాసీన వైఖరితో ఉందో అర్థం చేసుకోవచ్చు- అని కేటీఆర్ ట్వీట్ చేశారు. మరోవైపు ప్రభుత్వం సత్వరమే స్పందించి బాధితులను ఆదుకోవాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు డిమాండ్ చేశారు.

**సహాయక చర్యల్లో మంత్రి తుమ్మల..**

కాగా, ఖమ్మం వద్ద మున్నేరు వరద ఉధృతిని మంత్రి తుమ్మల పరిశీలించారు. ప్రకాశ్‌నగర్ వద్ద మున్నేరు బ్రిడ్జి పై వరదలో చిక్కిన వారిని రక్షించేందుకు జరుగుతున్న సహాయ చర్యలను పర్యవేక్షిస్తున్నారు. కాగా, హెలికాప్టర్‌తో రెస్క్యూ చర్యలు చేపట్టాలని మొదట్లో తెలంగాణ ప్రభుత్వం భావించింది. అయితే వాతావరణం అనుకూలంగా లేక పోవడంతో హెలికాప్టర్‌తో రెస్క్యూ ఆపరేషన్‌ను సోమవారం ఉదయానికి వాయిదా వేశారు.

**మహబూబ్ నగర్ స్కూళ్లకు రేపు సెలవు..**

రేపు కూడా భారీ వర్షం కురిసే అవకాశం ఉండడంతో మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ స్పందించారు. సోమవారం నాడు జిల్లాలోని పాఠశాలలన్నింటికీ సెలవు ఇస్తున్నట్టు ప్రకటించారు. అత్యవసరమైతే తప్ప ప్రజలెవరూ బయటకు రావొద్దని సూచించారు.

# 11 జిల్లాల్లో రెడ్ అలెర్ట్.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

-మొదటిపేజీ తరువాయి

పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో జిల్లాల వారీగా టోల్ ఫ్రీ నెంబర్లు ఏర్పాటు చేశామని, ప్రజలు ఏ అవసరం ఉన్నా కాల్ చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం నల్గొండ, ఖమ్మం, కరీంనగర్, వరంగల్, జనగామ, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, మహబూబాబాద్ వంటి 11 జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో ఆయా జిల్లాల అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ రోజు ఉదయం 4 గంటల నుంచే వివిధ జిల్లాల కలెక్టర్లు, ఆర్ అండ్ బీ శాఖ క్షేత్రస్థాయి అధికారులతో మంత్రి నిరంతరం సమీక్షస్తున్నారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ఎలాంటి పరిస్థితుల్లోనైన ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని సూచించారు. అంతే కాదు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్షాలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని చెప్పిన మంత్రి.. హైడ్రాతో గొలుసుకట్టు చెరువులను పునరుద్దరణ చేస్తున్నామని.. వచ్చే ఏడాది నుంచి హైదరాబాద్ కు వరద ముంపు ఉండదని.. అయన చెప్పారు. ఇక నల్గొండ జిల్లాలో గత 24 గంటలుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో పాటు.. మరో మూడు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రజలను కోరారు. జిల్లాల్లో గ్రామాల వారీగా కురుస్తున్న వర్షాపాతం.. జిల్లాలోని తాజా వాతావరణ పరిస్థితులపై ఎప్పటికప్పుడు కలెక్టర్ తో సమాచారం



తెప్పించుకుంటున్న మంత్రి.. కలెక్టర్ తో పాటు ఇతర జిల్లా అధికారులకు నిరంతరం సూచనలు చేస్తున్నారు. వర్షం అంతకంతకు పెరుగుతున్న నేపథ్యంలో అధికారులందరు అప్రమత్తంగా ఉండాలని, ఏ ఒక్కరు విధులకు గైర్హాజరు కాకుండా చూసుకోవాలని కలెక్టర్ నారాయణ రెడ్డి, జిల్లా ఎస్పీకి ఆదేశాలు జారీ చేశారు.

ముఖ్యంగా వర్షాల నేపథ్యంలో ఇళ్లలోకి నీరు వచ్చే ప్రాంతాలను గుర్తించడంతో పాటు.. విద్యుత్ సరఫరా విషయంలో తగు జాగ్రత్తలు తీసకోవాలని, స్తంభాలకు విద్యుత్ సరఫరా జరగకుండా ఎలక్ట్రిటీ శాఖ అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. మున్సిపల్ సిబ్బంది వీధివీధిలో అలెర్ట్‌గా ఉండి మ్యాన్ హోల్స్ అడ్డంకులను తొలగించి వర్షపునీరు వెళ్లేలా చూడాలని చెప్పారు. కూలిపోయేందుకు అవకాశం ఉన్న ఇండ్లలో ఉంటున్న ప్రజలను తక్షణం ఖాళీ చేయించాలని.. ఎంతమంది ప్రజలు వచ్చినా ఇబ్బందులు రాకుండా ఉండేలా పునరావాసా కేంద్రాన్ని తక్షణం అందుబాటులోకి తేవాలని మంత్రి కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఇవే కాకుండా.. గ్రామాలు, పట్టణాలలోని మంచి నీటి ట్యాంకులు కలుషితం కాకుండా తగు చర్యలు చేపట్టడంతోపాటు, అంటు వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ పౌడర్, క్లోరినేషన్ లను చేపట్టాలని తెలిపారు. అంతేకాదు, వైద్య బృందాలను అప్రమత్తం చేయాలని, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో తగు మందులను సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ కు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు అత్యవసరం అయితే తప్పా ఇళ్లు విడిచి బయటకు రారాదని.. ఏదైనా ఇబ్బందికర పరిస్థితులు ఉంటే ప్రభుత్వ కంట్రోల్ రూం ఫోన్ నెంబర్ కు ఫోన్ చేసి తెలియజేయాలని ఆయన కోరారు. ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు, ట్రాన్స్‌కో, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, మున్సిపల్, పోలీసు, వ్యవసాయ శాఖ అధికారులంతా అందుబాటులో ఉంటూ ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా కంట్రోల్ రూమ్ 24 గంటలు పని చేసే విధంగా సిబ్బంది 3 షిఫ్టులుగా ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పారు. నల్గొండ ప్రజలకు ఏదైన తక్షణ సహాయం అవసరంఉంటే.. 1800 4251 442 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రజలకు సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రజలకు ప్రాణహాని, ఆస్తి నష్టం జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండి పనిచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉందని.. ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా కల్పించారు.

# బ్రాండ్ ఇమేజ్ కోసమే హైడ్రానా...

-మొదటిపేజీ తరువాయి

సీఎం రేవంత్ రెడ్డి చాలా స్పష్టంగా హైదారాబాద్ లోని చెరువు భూముల కబ్జాదారులను వదిలేది లేదని స్పష్టం చేశారు. తన కుటుంబ సభ్యులైనా, స్వంత పార్టీ వారైనా, వీఐపీలయినా సరే చెరువు ఎఫ్. టీ.ఎల్ లో లేదా బఫర్ జోన్లో కట్టడాలు నిర్మిస్తే కూల్చక తప్పదని వార్నింగ్ కూడా ఇచ్చారు.భగవద్గీత స్ఫూర్తితో తాను ఈ పని చేస్తున్నట్లు చెప్పారు. దానికి తగ్గట్టుగానే బీఆర్ఎస్ నుండి తన పార్టీలో చేరిన దానం నాగేందర్ అనుచరుడి కట్టడం, కాంగ్రెస్ నేత పల్లం రాజు బంధువుల కట్టడాలను హైడ్రా కూల్చి వేసింది. ఎం.ఐ.ఎం ఎమ్మెల్యేలు మహ్మద్ ముబీన్, ఎం.ఐ.ఎం ఎమ్మెల్సీ మహ్మద్ మీర్జా కు సంబంధించిన నిర్మాణాలను చెరువు భూముల్లో ఉన్న ఆక్రమణల పేరుతో హైడ్రా కూల్చి వేసింది. కేటీఆర్ ఆధీనంలోఉన్న జన్వాడ ఫాం హౌస్ కూల్చివేతకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. మరో వైపు పొంగులేటి, కేవీపీ, మధుయాష్కీ, పట్నం మహేందర్ రెడ్డిలకు ఉన్న ఫాం హౌస్ లు బఫర్ జోన్లోనే ఉన్నాయని వాటిని కూల్చాలని బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. తాజాగా సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డికి అధికారులు నోటీసులు పంపారు. దుర్గం చెరువు ఎఫ్. టీ.ఎల్ జోన్లో తిరుపతిరెడ్డికి చెందిన కట్టడాలు ఉన్నాయని 30 రోజుల్లో వాటిని కూల్చివేయాలని నోటీసులో పేర్కొన్నారు. ఇలా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఎం.ఐ.ఎం అన్ని పార్టీలకు హైడ్రా సెగ తగలింది. ఇది చివరకు ఎటు దారి తీస్తుందా అన్న చర్చ ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో సాగుతోంది.రాజకీయ నాయకులు ఏం చేసినా అందులో రాజకీయాలే ఉంటాయి. ఇది స్వయాన సీఎం రేవంత్ రెడ్డి ఓ మీడియా ఇంటర్వ్యూలో చెప్పిన మాట. హైదరాబాద్ లో చెరువుల పరిరక్షణ, పర్యావరణం వంటి అంశాలు ఉన్నప్పటికీ రాజకీయ ప్రయోజనాలు లేకుండా ఎవరూ ఏ పని చేయరన్నది రాజకీయాలు ఏ మాత్రం తెలిసినా అవగతం అయ్యే విషయం. హైడ్రా పేరుతో జరుగుతున్న చర్చ గత కొద్ది రోజులుగా ప్రజల్లో బాగా నానుతుంది. గత రాజకీయాలు, సమకాలీన రాజకీయాలను పరిశీలిస్తే తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల్లో కొద్ది మంది పేరే ప్రజల్లో నానుతుంది.ప్రజాభిమానం మిన్నగా ఉన్న ప్రజా నాయకుడిగా ఎన్టీఆర్ పేరు ను తెలుగు ప్రజలంతా తలచుకుంటారు. సినిమా హీరోగా అనే ఇమేజ్ మాత్రమే కాకుండా డైనమిక్ సీఎంగా పేరు తెచ్చుకున్నారు. కిలో రెండు రూపాయల బియ్యం, మహిళలకు ఆస్థి హక్కు , జనతా వస్త్రాలు, పటేల్ పట్వారీ వ్యవస్థల రద్దు వంటి పథకాలతో సంక్షేమానికి చిరునామాగా ఎన్టీఆర్ ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఇప్పటికీ తెలుగు ప్రజలు "అన్న ఎన్టీఆర్" అని తమ హృదయాల్లో ఆయన పేరు భద్రపరుచుకున్నారు.ఆ తర్వాతి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. పని రాక్షసుడిగా, గొప్ప అడ్మినిస్ట్రేటర్ గా గుర్తింపు పొందారు. సైబరాబాద్ నిర్మాణం వెనుక ఆయన కృషి పేరు తెచ్చిపెట్టింది. పాలన విషయాల్లో చాలా మార్పులు తెచ్చిన వ్యక్తి గా పాలనా దక్షుడిగా చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్ సంపాదించుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ప్రజా ప్రస్తానం పేరుతో 1470 కిలోమీటర్లు పాదయాత్ర చేసి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారు. అనంతరం ప్రజల ముఖ్యమంత్రిగా వైఎస్ ప్రజల గుండెల్లో "చిరస్థాయిగా నిలిచిపోయారు. పెదలకు ఆరోగ్య శ్రీ ద్వారా కార్పోరేట్ వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చి ప్రాణదాతగా పేరు తెచ్చుకున్నారు. ఉచిత విద్యుత్ ఇచ్చి రైతులకు ఆపద్బాంధవుడు అయ్యారు. విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్మెంట్ పథకాలతో అన్ని వర్గాల నేతగా వైఎస్ గుర్తింపు తెచ్చుకున్నారు. అంతే కాదు రాజన్న అని వచ్చే వారికి అన్నగాఆదుకుంటాడన్న ఇమేజ్ వై.ఎస్ స్వతంతం. టోటల్ గా చెప్పాలంటే ఓ లీడర్ గా వై.ఎస్ ను అందరు అభిమానిస్తారు.తెలుగు రాష్ట్రాల విభజన తర్వాత తెలంగాణ అంటే కేసీఆర్. కేసీఆర్ అంటే తెలంగాణ అన్న ఇమేజ్ ను కేసీఆర్ సంపాదించుకున్నారు. అంతే కాకుండా రైతు బంధు, రైతు బీమా పథకాలు ప్రవేశపెట్టి తనకంటూ ఓ బ్రాండ్ ఇమేజ్ సృష్టించుకున్నారు కేసీఆర్. తెలంగాణ చరిత్రలో కేసీఆర్ పాత్ర ఎవరూ.. మరిచిపోలేనిదితెలంగాణ రాష్ట్రంలో పీసీసీ చీఫ్ గా బాధ్యతలు చేపట్టి కాంగ్రెస్ ను అధికారంలోకి తెచ్చిన వ్యక్తిగా రేవంత్ రెడ్డి ఇప్పటికే ఓ ఇమేజ్ సృష్టించుకున్నారు. దూకుడు రాజకీయాలు, స్పష్టంగా, సరళంగా, సూటిగా మాట్లాడే వాక్పటిమ రేవంత్ స్వంతం. ఏలాంటి సమస్య వచ్చినా వెనకడుగు వేయకుండా ముందుకు వెళ్లే తత్వం రేవంత్ ది అని ఆయన సన్నిహితులు చెబుతారు. పార్టీ అధ్యక్షుడిగా పాస్ మార్కులు సాధించిన రేవంత్ రెడ్డి , ఇప్పటికే బ్రాండ్ ఇమేజ్ సంపాదించుకున్న సీఎంల సరసన చేరాలంటే పాలనలో తనకంటూ ఓ సరళిని ఏర్పాటు చేసుకోవాల్సిందే. అందులో భాగంగానే ఈ హైడ్రా అస్త్ర ప్రయోగం చేశారా అన్న చర్చ సాగుతోంది.హైదరాబాద్ నగరంలో చెరువు భూముల్లో అక్రమంగా నిర్మించుకున్న కట్టడాల్లో దాదాపు 95 శాతం బడా బాబులవే. వాటిని కూల్చడాన్ని ఇప్పటికే అన్ని వర్గాల ప్రజలు మద్ధతు తెలపడం చూస్తున్నాం. ఇలా పెద్దలను దెబ్బ కొట్టడం ద్వారా పేద, మధ్య తరగతి వర్గాల ముఖ్యమంత్రిగా ఇమేజ్ సంపాదించుకుంటున్నారా అన్న చర్చ ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో సాగుతోంది. తన కుటుంబ సభ్యులు, పార్టీ నేతలు, మంత్రులు, స్వపక్ష, విపక్ష తేడా లేకుండా అక్రమ కట్టడాలు కూల్చేస్తామని రేవంత్ రెడ్డి ప్రకటన చేయడం కూడా సీఎంకు నిష్పాక్షికత కలిగిన డైనమిక్ సీఎంగా ఇమేజ్ సాధించుకునే లక్ష్యంలో భాగమేనా అన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. భవిష్యత్తులో చరిత్రను పరికిస్తే ముఖ్యమంత్రుల్లో తనకంటూ ఓ పేజీ ఉండాలని రేవంత్ కోరుకుంటున్నారా.. అందుకే ఇంటా,బయట పెద్ద ఎత్తున హైడ్రా చర్యలపై విమర్శలు వస్తున్నా... లెక్క చేయకుండా, ఇలాంటి సాహసోపేతమైన చర్యలకు సిద్దపడ్డారా అన్నది కూడా ఆలోచించాల్సి ఉంది. ఏది ఏమైనా రాజకీయ నేతల మౌనం వెనుక, వారు చేసే ప్రకటనల వెనకు, వారు చేసే చర్యల వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉండటం సామాన్యమైన విషయం. ఇది కూడా ఆ కోవలేకి రాదని చెప్పలేం. కారణమేదైనా....హైదరాబాద్ నగరంలోని చెరువుల పరిరక్షణకు రేవంత్ నడుం కట్టడం మాత్రం నగరవాసుల నుండి మంచి స్పందన రావడం అందరూ గమనించాల్సిన అంశం.

## అప్రమత్తంగా ఉండాలి

-మొదటిపేజీ తరువాయి

ఎత్తి నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. మరోవైపు ఎల్లంపల్లికి వచ్చిన వరద నీటిని వీల్కెనంత మేరకు లిఫ్ట్ చేయాలని, రోజుకు ఒక టీఎంసీ తగ్గకుండా డ్రా చేయాలని అధికారులు ఆదేశించారు. నంది, గాయత్రి పంప్ హౌస్‌ల ద్వారా లిఫ్ట్ చేసి రిజర్వాయర్లు నింపాలని ముఖ్యమంత్రి రేవంత్ సూచించారు. మిడ్ మానేరు, లోయర్ మానేరు డ్యామ్‌తో పాటు రంగనాయక్ సాగర్, మల్లన్న సాగర్ వరకు జలాశయాల్లోకి ఏకధాటిగా నీటిని లిఫ్ట్ చేయాలని ఆదేశించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు సామర్థ్యం 20 టీఎంసీలు కాగా ప్రస్తుతం 18.45 టీఎంసీల నీటి నిల్వ ఉంది. కడెం ప్రాజెక్టు నుంచి ప్రవాహం ఉధ్ధృతంగా వస్తుండటంతో నంది, గాయత్రి పంప్ హౌస్‌ల ద్వారా మిడ్ మానేరుకు నీటిని అధికారులు పంపిస్తున్నారు. ఇక మిడ్‌మానేరు ప్రాజెక్టు సామర్థ్యం 27 టీఎంసీలు కాగా ప్రస్తుతం 15 టీఎంసీల నీటి నిల్వ ఉంది. అక్కడి నుంచి 14 వేల క్యూసెక్కులకు పైగా లోయర్ మానేరు డ్యామ్‌కు, మరో 6,400 క్యూసెక్కులు అన్నపూర్ణ రిజర్వాయర్ ద్వారా రంగనాయక్ సాగర్‌కు తరలిస్తున్నారు. మరోవైపు రంగ నాయక సాగర్ నుంచి నీటిని పంపింగ్ చేసి మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ నింపాలని, అక్కడి నుంచి సింగూర్ ప్రాజెక్ట్, నిజాంసాగర్ ప్రాజెక్ట్ వరకు నీటిని తరలించాలని ఆదేశించారు. కేంద్ర జల సంఘం మార్గదర్శకాల ప్రకారం మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్లలో సాధ్యమైనంత వరకు నీటిని నిల్వ చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. మల్లన్నసాగర్‌లో గరిష్ఠంగా 18 నుంచి 20 టీఎంసీలు, కొండపోచమ్మ సాగర్‌లో 10 టీఎంసీలు నిల్వ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అన్ని ముందు జాగ్రత్తలు పాటించాలని ఆయన అప్రమత్తం చేశారు. కొండపోచమ్మ సాగర్ నుంచి హల్దీ వాగు ద్వారా నిజాంసాగర్ ప్రాజెక్టుకు నీటిని తరలించాలని ఆయన సూచనలు చేశారు.

## తెలంగాణ-ఏపీ మధ్య నిలిచిన రాకపోకలు..

తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు దంచికొడుతున్నాయి. ఈ క్రమంలో వాగులు వంకలు పొంగుతున్నాయి. ఈ క్రమంలో పలుచోట్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతున్నది. చిమిర్యాల వాగు ఉధ్ధృతంగా ప్రవహిస్తుండడంతో ఏపీ-తెలంగాణ సరిహద్దులో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. తెలుగు రాష్ట్రాల సరిహద్దు రామాపురం వద్ద చిమిర్యాల వాగు ఉగ్రరూపం దాల్చింది. కోదాడ దిగువన చిమిర్యాల వాగు, పాలేరు భీకరంగా ప్రవహిస్తున్నాయి.

కోదాడ నుంచి దిగువకు భారీగా వరద నీరు ప్రవహిస్తోంది. నల్లబండగూడెం వద్ద జాతీయ రహదారిపైకి వరద నీరు చేరింది. దాంతో చిమిర్యాల వద్ద జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద కిలోమీటర్ల కొద్దీ వాహనాలు నిలిచిపోయిన పరిస్థితి కనిపిస్తోంది. తెలంగాణ - ఏపీ మధ్య నిలిచిన వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. తెలంగాణ - ఏపీ సరిహద్దు రామాపురం వద్ద చిమిర్యాల వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. కోదాడ నుంచి వరదనీరు దిగువకు ప్రవహిస్తుంది. నల్లబండగూడెం వద్ద జాతీయ రహదారిపైకి నీరు చేరడంతో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఇక ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం ఐతవరం గ్రామం వద్ద జాతీయ రహదారిపై మున్నేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. హైవేపై మోకాళ్ల లోతు వరద ఉండడంతో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారిపై వాహనాలు రాకుండా పోలీస్ రెవెన్యూ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. హైదరాబాద్ వైపు చిలకల్లు టోల్ ప్లాజా వద్ద, విజయవాడ వైపు కీసర టోల్ ప్లాజా వద్ద వాహనాలను నిలిపివేశారు. దీంతో హైవే పూర్తిగా స్తంభించిపోయింది. వరద ఉధృతి తగ్గే వరకు వాహనాలను హైవేపైకి అనుమతించబోమని నందిగామ ఆర్డీవో తెలిపారు. ఇక నల్లబండగూడెం వద్ద పాలేరు వాగులో ఆర్టీసీ బస్సు చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. బస్సులోని 30 మంది ప్రయాణికులు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. రహదారులపైకి నీరు చేరుకోవడంతో విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే ఆర్టీసీ బస్సులను అధికారులు నిలిపివేశారు. నల్లబండగూడెం వద్ద పాలేరు వాగులో ఆర్టీసీ బస్సు చిక్కుకుపోయింది. బస్సులో ఉన్న 30 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటికి రావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## అధికారులకు సెలవులు రద్దు చేసి..

## 24 గంటలు అప్రమత్తంగా ఉండండి

**భారీ వర్షాల నేపథ్యంలో హరీశ్‌రావు సూచన**

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి ఎక్కడికక్కడ అత్యవసర సేవలు అందించేందుకు బృందాలు ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు సూచించారు. అవసరమైతే సైన్యం సహాయం తీసుకోవాలని.. ప్రత్యేక హెలికాప్టర్లను తెప్పించాలని అన్నారు. నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గంలోని కొండభీమనపల్లి బీసీ గురుకుల పాఠశాలలో రాత్రిపూట నిద్రిస్తున్న విద్యార్థులను ఎలుకలు కరవడంతో 14 మంది విద్యార్థులు గాయపడటంతో.. ఆ గురుకుల పాఠశాలను మాజీ మంత్రులు గంగుల కమలాకర్, జగదీశ్‌రెడ్డితో కలిసి హరీశ్‌రావు ఆదివారం ఉదయం స్పందించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. పూర్తిగా నిండిన చెరువులు, కాలువలు తెగకుండా ఇరిగేషన్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆపదలో ఉన్న బాధితులకు సహాయక చర్యలు అందించాలని బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. మరో రెండు రోజులు భారీ వర్షాలు ఉన్నాయని అంటున్నారని.. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. అధికారులకు సెలవులు రద్దుచేసి 24 గంటలు అప్రమత్తంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రమాదకరంగా ప్రవహించే వరదల్లో, చెరువులు, కాలువలు వద్దకు ఎవరు వెళ్లవద్దని ప్రజలకు సూచించారు. పోలీసులు ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రజలను సురక్షితంగా కాపాడాలని కోరారు.

## మరో డీఎస్సీకి సన్నాహాలు

-మొదటిపేజీ తరువాయి

సమాచారాన్ని జిల్లాల వారీగా సేకరిస్తోంది. ఇందుకు సంబంధించి ఖాళీలు ఎన్ని ఉన్నాయనే అంశంపై అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. ఇప్పటికే 11,062 పోస్టుల భర్తీకి డీఎస్సీ నిర్వహించి ప్రాథమిక కీని విడుదల చేశారు. సెప్టెంబరు మొదటి వారంలో ఫలితాలు వెలువడే అవకాశం ఉంది. ఆ తర్వాత అక్టోబరు నెలాఖరు నాటికి జిల్లాల వారీగా నియామకాలను పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. అవి కాగానే కొత్త డీఎస్సీని ప్రకటించాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.కొత్త డీఎస్సీ కోసం రాష్ట్రంలో భర్తీ చేయాల్సిన ఉపాధ్యాయ పోస్టుల సంఖ్య ఏ మేరకు ఉండవచ్చనే అంశంపై అధికారులు జిల్లాల వారీగా సమాచారం సేకరిస్తున్నారు. పాఠశాలల సంఖ్య, అందులోని విద్యార్థులు, ఖాళీల వివరాలను పరిశీలిస్తున్నారు. ఇప్పటికే ప్రకటించిన డీఎస్సీ ద్వారా నియమితులయ్యే ఉపాధ్యాయులు అందుబాటులోకి వచ్చిన తర్వాత.. ఇంకా ఎన్ని ఖాళీలు ఉంటాయన్న దానిపై అధ్యయనం చేస్తున్నారు. కాగా, పాఠశాలల్లో ఖాళీలు ఉన్నా.. వాటిని భర్తీ చేయడంలో సమస్యలు తలెత్తే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య యేటా పడిపోతోంది. దాంతో చాలాచోట్ల టీచర్ పోస్టులున్నా.. అందుకుతగ్గట్లుగా విద్యార్థులు లేరు. ఇలాంటి సందర్భంలో క్రమబద్ధీకరణను అమలు చేయాలి. ఉపాధ్యాయులను విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న ఇతర పాఠశాలలకు బదిలీ చేయాల్సి ఉంటుంది. కానీ, ఇప్పటివరకు అలాంటి ప్రయత్నం జరగడం లేదు. ఈ పనిచేసిన తర్వాతనే ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటే ప్రయోజనం అన్న అభిప్రాయం వినిపిస్తోంది.తెలంగాణలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జులై 18 నుంచి ఆగస్టు 5 వరకు డీఎస్సీ కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ పరీక్షలకు మొత్తం 2,79,957 దరఖాస్తులు అంగా... మొత్తం 2,45,263 మంది (87.61 శాతం) పరీక్షలకు హాజరయ్యారు. డీఎస్సీ పరీక్షలకు 34,694 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. అత్యధికంగా సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ) పోస్టులకు 92.10 శాతం హాజరయ్యారని పాఠశాల విద్యాశాఖ తెలిపింది. ఉపాధ్యాయ దినోత్సవం సెప్టెంబరు 5 నాటికి నియామక పత్రాలు ఇవ్వాలని ప్రభుత్వ యోచనగా ఉంది.తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు తమకు ఉద్యోగాలివ్వాలని కోరుతూ 2008-డీఎస్సీ బాధితులు సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి తరలివచ్చారు. డీఎస్సీ-2008 సాధన సమితి నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి 200 మందికిపైగా అభ్యర్థులు వచ్చారు. కాగా, వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఆరుగురు ప్రతినిధుల బృందాన్ని సీఎం నివాసంలోకి అనుమతించారు. తమకు ఉద్యోగాలివ్వాలని హైకోర్టు ఫిబ్రవరి 8న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని వారు ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి జైపాల్ రెడ్డికి తెలిపారు.

## సంపాదకీయం

# సినిమాలపై రాజకీయాలా

నటి కంగనా రనౌత్ ఉన్నచోటుకు వివాదాలు వస్తాయో లేక వివాదాలను వెతుకుంటూ కంగనా వెళ్తారో కానీ.. కంగనా, కాంట్రవర్సీలు ఎప్పుడూ కలిసే ఉంటాయి. తాజాగా ఆమె స్వీయదర్శకత్వంలో నటించిన ఎమర్జెన్సీ మూవీ..వివాదాలకు కేరాఫ్‌గా మారింది. నిత్యం వివాదాలతో సహవాసం చేసే కంగనా.. ఎమర్జెన్సీ మూవీతో మారోసారి కంట్రావర్సీకి కేరాఫ్‌గా మారారు. ఈ మూవీని ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకుంటామని ఓ వర్గం హెచ్చరిస్తుంటే.. కంగనా మాత్రం తగ్గేదే లేదంటూ కౌంటర్ ఇస్తున్నారు. మరోవైపు తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల్లో "ఎమర్జెన్సీ" మూవీని బ్యాన్ చేసే దిశగా అడుగులు పడుతున్నాయి.మాజీ ప్రధాని ఇందిరాగాంధీ రాజకీయ జీవితం ఆధారంగా "ఎమర్జెన్సీ" మూవీని తెరకెక్కించారు. ఇందులో కంగనా రనౌత్ కథానాయిక. అనుపమ్ ఖేర్, మహిమా చౌదరి కీలక పాత్రలు పోషించారు. సెప్టెంబర్ 6న మూవీని విడుదల చేసేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది. అయితే ఈ చిత్రంలో తమని తప్పుగా చూపించారని సిక్కులు ఆరోపిస్తున్నారు. ఈ సినిమా రిలీజ్‌పై బ్యాన్ విధించాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు సినిమాను రిలీజ్ చేస్తే చంపేస్తామంటూ కంగనకు బెదిరింపులు కూడా వస్తున్నాయి. అయితే ఎన్ని ఆరోపణలు ఎదురైనా.. బెదిరింపులు వచ్చినా భయపడే ప్రసక్తే లేదంటున్నారు కంగనా. ఎట్టి పరిస్థితుల్లోనూ సినిమాను రిలీజ్ చేసి తీరుతానని, ఎవరు అడ్డుకుంటారో చూస్తానంటూ కౌంటర్ ఇస్తున్నారు. ఇంత జరుగుతున్నప్పటికి బాలీవుడ్ నుంచి తనకు మద్దతు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు కంగనా. బాలీవుడ్‌లో టాలెంట్ ఉన్నవారికి ఎలాంటి గుర్తింపు లభించదని, ఇదొక నిస్సాహాయ ప్రదేశమని సంచలన వ్యాఖ్యలు చేశారు. కంగనా తెరకెక్కించిన ఎమర్జెన్సీ చిత్రాన్ని.. తెలంగాణ కాంగ్రెస్ నేతలు కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇందిరాగాంధీ కుటుంబాన్ని ప్రజలకు దూరం చేయాలని ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని, కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు. కాంగ్రెస్‌ను నేరుగా ఎదుర్కోలేక కంగనా రూపంలో బీజేపీ కుట్రలు చేస్తోందని ఆరోపిస్తున్నారు హస్తం పార్టీ నేతలు.కెరీర్ ఆరంభంలో ఆఫర్స్ లేక తాను తీవ్ర ఇబ్బందులు పడ్డానని, ఓ దశలో విదేశాలకు కూడా వెళ్లిపోవాలనుకున్నానంటూ కామెంట్స్ చేశారు. అలాగే తన సినిమాకు ఇంకా సెన్సార్ సర్టిఫికేట్ రాకపోవడంపై కూడా అసహనం వ్యక్తం చేస్తున్నారు కంగనా. తన సినిమా కోసం ఎలాంటి పోరాటం చేయడానికైనా సిద్ధమేనని..అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని ప్రకటించారు.యాక్టర్ నుండి పొలిటిషియన్‌గా మారిన కంగనాకు వివాదాలు కొత్త కాదు. బంగ్లాదేశ్ ఆందోళకారులతో రైతులను కంగనా పోల్చడంపై ఇటీవల దుమారం చెలరేగింది. గతంలో కూడా సాగు చట్టాలను వ్యతిరేకించిన వాళ్లను, ఉగ్రవాదులతో పోల్చారు కంగనా. రైతుల నిరసనల వెనుక విదేశీ కుట్ర ఉందంటూ ఆరోపించారు. ప్రభాస్ ఏక్ నిరంజన్ తో మనకు పరిచయమైనా పూర్తిగా హిందీ సినిమాలకే పరిమితమైన కంగనా రౌనత్ క్రిష్ దర్శకత్వం వహించిన మణికర్ణికతో మనకు మరింత దగ్గరయ్యింది. ఫైర్ బ్రాండ్ గా పేరున్న ఈ ఉంగరాల జుత్తు అమ్మాయి స్వంతంగా డైరెక్ట్ చేసిన మూవీ ఎమర్జెన్సీ. సెప్టెంబర్ 6 విడుదల కావాల్సిన ఈ చిత్రానికి వివాదాలు చుట్టుముట్టాయి. ఇందిరాగాంధీ 1975 నుంచి 1977 వరకు విధించిన అత్యయిక పరిస్థితి దేశంలో తీవ్ర అలజడికి దారి తీసింది. పౌర హక్కులను అడ్డుకునే చట్టం కావడంతో పాటు ఎన్నికలను సైతం నిలిపేసే వ్యవస్థను తేవడంతో ఒక్కసారిగా కలకలం రేగింది.ఎమర్జెన్సీ నడిచిన 21 నెలల పాటు ఎదురుకున్న ఆనాటి స్థితిగతులను కళ్ళకు కట్టినట్టు చూపాలనే ఉద్దేశంతో కంగన రౌనత్ దాన్ని అదే టైటిల్ తో తెరకెక్కించింది. అప్పట్లో పలు వివాదాలకు కేంద్ర బిందువుగా నిలిచిన ఇందిరాగాంధీ కొడుకు సంజయ్ గాంధీ గురించి కూడా ఇందులో కీలక ప్రస్తావన ఉందట. సదరు నటుడికి బెదిరింపు కాల్స్ వచ్చాయి. సహజంగానే కాంగ్రెస్ పార్టీ నుంచి ఈ సినిమా పట్ల తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోంది. పలు మైనారిటీ వర్గాలతో పాటు పంజాబ్ కు చెందిన కుల సంఘాలు ఎమర్జెన్సీని నిషేదించాలని ఆర్జీలు పెట్టుకున్నాయి. సెన్సార్ బోర్డు సైతం ఇందులో సున్నితత్వాన్ని గుర్తించింది.గతంలో ఇదే తరహాలో ఇందూ సర్కార్ అనే మూవీ వచ్చింది. కానీ స్టార్ క్యాస్టింగ్ లేకపోవడంతో పాటు తీసిన విధానం ఆసక్తికరంగా లేకపోవడంతో ఫ్లాప్ అయ్యింది. అందుకే ఎక్కువ కాంట్రావర్సికి చోటు దక్కలేదు. కానీ ఇప్పుడు కంగనా రౌనత్ లాంటి పేరున్న ఆర్టిస్ట్ తీయడంతో ఎక్కడ లేని ప్రచారం వచ్చేసింది. అధికారంలో ఉన్నది బిజెపి ప్రభుత్వం కాబట్టి క్లియరెన్స్ వస్తుందనే కామెంట్ల నేపథ్యంలో ఒకవేళ వివాదం కోర్టు మెట్లు ఎక్కితే ఎలాంటి తీర్పు వస్తుందో చూడాలి. మోక్షం దక్కించుకుని బయటికి వచ్చాక నిజంగా ఊహించినట్టు వివాదాస్పద అంశాలు ఉంటే మాత్రం కంగనాకు ఇబ్బందే.కేంద్ర తీసుకున్న చర్యల వల్లే పరిస్థితి అదుపులో ఉందని, లేకుంటే దేశంలో బంగ్లాదేశ్ తరహా పరిస్థితికి దారి తీసేదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు కంగనా.కంగనా వ్యాఖ్యలతో భగ్గుమన్నారు కాంగ్రెస్ నేతలు. రైతులను ఉగ్రవాదులతో పోల్చిన కంగనాను, బీజేపీ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. దీంతో రంగంలోకి దిగిన బీజేపీ హైకమాండ్.. కంగనా వ్యాఖ్యలతో పార్టీకి సంబంధం లేదని వివరణ ఇచ్చింది. రైతులపై కంగనా చేసిన వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన బీజేపీ, భవిష్యత్‌లో ఇలాంటి కామెంట్స్ చేయవద్దని హెచ్చరించింది. ఆ వివాదం సద్దుమణిగిందో లేదో, ఎమర్జెన్సీ మూవీతో మరోసారి కాంట్రవర్సీలో చిక్కుకున్నారు నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్.ఎట్టి పరిస్థితుల్లోనూ సినిమాను రిలీజ్ చేసి తీరుతానని, ఎవరు అడ్డుకుంటారో చూస్తానంటూ కౌంటర్ ఇస్తున్నారు.

# విద్యావిధానం ఇలా ఉంటే..

ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే ఉన్నత చదువులు చదువుకున్న నేను గత రెండు దశాబ్దాలుగా వివిధ ప్రయివేటు విద్యాసంస్థల్లో గణిత ఉపాధ్యాయుడిగా, భౌతికశాస్త్ర అధ్యాపకుడిగా, అప్పుల తాకిడితో విపరీతమైన ఆర్థిక సమస్యలను చూసిన విద్యాసంస్థల నిర్వాహకుల్లో ఒకడిగా ఉంటున్నాను.అన్నింటికీ మించి విద్యారంగ ప్రేమికుడిగా నాకు విద్యతో విడదీయరాని సంబంధం, విడదీయలేని అనుబంధం వుంది. పాఠాలు బోధించిన అనుభవంతో నేటి విద్యావ్యవస్థలోని మార్పులపై నేను కొన్ని నా ఆలోచనలను బాధ్యతతో మీకు విన్నవిస్తున్నాను. ఈ రోజు విద్య కొంతమంది స్వార్థం, కొన్ని రాజకీయ కారణాల వల్ల వ్యాపారంగా తన రూపు మార్చుకోవడం ప్రారంభమైంది. ఐఐటీ, నీట్ వంటివి అసామాన్యమైన ప్రతిభ గల గ్రామీణ, తాలుకా స్థాయి పేద విద్యార్థులకు సైతం అందని ద్రాక్ష అయ్యింది. అందుకే పేద ధనిక సామాజిక సాంస్కృతిక సాంఘిక లింగ కుల మతం వంటి తదితర అంతరాలు లేకుండా అందరికీ సమానంగా "అంతర్జాతీయ స్థాయి విద్య"అందాలి. చదువు "కొనడం" పూర్తిగా మాయమై చదువుకునే అవకాశాలు గల్లీ నుంచి ఢిల్లీ దాకా అందరికీ సమానంగా ఉండాలి. అంతరిక్ష ప్రయోగాల కాలంలో మనం రాణించాలంటే మీరన్నట్లు ప్రపంచంతో పోటీపడాల్సిందే. ప్రైమరీ, హైస్కూల్, ఇంటర్ స్థాయి సిలబస్‌లు ఒకదానికొకటి సంబంధం ఉండాలి. సబ్జెక్ట్ నిపుణుల సాయంతో రాష్ట్ర జాతీయ అంతర్జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల కనుగుణంగా నూతన సిలబస్, బోధనా పద్ధతులును రూపొందించాలి. మనం అక్కడక్కడ వెలుగులోకి వస్తున్న ఫేక్ సర్టిఫికెట్‌లు కొనుక్కునే స్థాయి కాకుండా వంద ఏళ్ల చరిత్ర కలిగిన మన విశ్వ విద్యాలయాల్లో పి.హెచ్ డి, ఎం.ఎస్సీ, బి.ఎడ్ వంటి తదితర చదువులు చదివి నెట్, సెట్, టెట్ వంటి అర్హత పరీక్షల్లో పాసై, విద్యారంగం, బోధనపై ఆసక్తి వుండి కొన్ని కారణాల వల్ల ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉద్యోగం పొందని వారికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి విద్యాసంస్థలు నెలకొల్పేలా ప్రోత్సహించాలి. కేజీ నుంచి పీజీ వరకు బోధన, బోధనేతర ఖాళీలను ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్



సాయంతో భర్తీ చేయాలి. బడ్జెట్‌లో విద్యకు 15% నిధులు కేటాయించాలి. ప్రభుత్వ విద్యాసంస్థల్లో కూడా సెమీ రెసిడెన్షియల్ విధానాన్ని అమలు చేస్తూ ఐఐటీ నీట్ ఫౌండేషన్ విద్యను కూడా ఒత్తిడి లేకుండా అందించగలిగితే విద్యను వ్యాపారం చేస్తున్న వ్యవస్థలను మనం నిర్మూలించవచ్చు. ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయ, అధ్యాపక పిల్లలు ప్రభుత్వ స్కూల్లో, కళాశాలల్లో చదివిస్తే ఆ తల్లిదండ్రులను గుర్తించి, వారి గురించి ఆదర్శప్రాయంగా మీడియాలో రాస్తున్నారంటే మన ప్రభుత్వ పాఠశాల, కళాశాల విద్యావ్యవస్థపై లోతుగా విశ్లేషించాల్సిన అవసరం వుంది. ఆర్థికంగా లేని వాళ్లే ప్రభుత్వ బడిబాట అనే విధానంలో కచ్చితంగా మార్పు రావాలి. విద్య మనందరి ప్రాథమిక హక్కు. శారీరక, మానసిక దృఢత్వం కోసం ఆటలకు ప్రత్యేక సమయం కేటాయించాలి. మీరు తెలంగాణ క్రీడాకారులను ఒలింపిక్స్ పథకాలు తెచ్చేలా ప్రోత్సాహం అందిస్తామన్న తీరును స్వాగతిస్తున్నాం. దానికి పాఠశాలలే పునాది కావాలి. సివిల్స్ ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు మీరు అందించిన ఆర్థికసాయం అభినందించదగినది. దానివల్ల భవిష్యత్‌లో మన రాష్ట్రం నుంచి సివిల్స్‌కు పోటీపడే అభ్యర్థుల సంఖ్య పెరుగుతుంది. విశ్వవిద్యాలయాల స్థాయిలో పరిశోధనలు పెరిగేలా రిసెర్చ్ స్కాలర్స్‌కు కూడా స్కాలర్‌షిప్ అందించాలి. రసాయనాల కోసం ఆర్థిక సాయం అందించాలి. ఇంజనీరింగ్, మెడికల్ విద్యా వ్యవస్థలో నూతనత్వం కోసం నిపుణుల సలహాలు తీసుకోవాలి. మన పిల్లలకు నాణ్యతతో కూడిన, ఆందోళన లేని పరిసరాలతో స్నేహం చేసే శాస్త్రీయ విద్యను మనం అందించాలి. వివిధ రంగాల ప్రజల నుంచి, వివిధ రకాల విద్యాసదస్సులు, చర్చల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సీఎం రేవంత్ రెడ్డి విభిన్న ఆలోచనల సారాంశాన్ని సేకరించి ఓ మంచి విద్యావిధానంతో మన పిల్లలకు గొప్ప గొప్ప కలల భవిష్యత్తును నిజం చేయాలి.

# చిత్తశుద్ధే హైడ్రా సక్సెస్‌కి మూలం

దాదాపు 25 లక్షల గృహాలున్న హైదరాబాద్ నగరంలో నిజాం కాలం నుండి కొన్ని వేల నీటి కుంటలు, చెరువులు, సరస్సులు, నాలాలు ఉండేవి. అనేక తోటలతో అందమైన నగరంగా విలసిల్లింది. కానీ వాటిలో 60-70 శాతం అక్రమంగా ఆక్రమించి పెద్ద భవనాలు, పరిశ్రమలు, నివాస గృహాలు, ఫామ్ హౌస్‌లు, అపార్ట్ మెంట్లు, ఫార్మా సిటీలు నిర్మించారు అక్రమదారులు.. భాగ్యనగరంలో వర్షాకాలం వస్తే చాలు నీరు ఉప్పొంగి రోడ్లను, గృహ సముదాయాలను వరద ముంచెత్తుతోంది. దీంతో నీటి వనరుల పరిరక్షణే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం "హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఎసెట్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్" (హైడ్రా)ను ఏర్పాటు చేసింది. నిబంధనలను ఉల్లంఘించి, చట్ట వ్యతిరేకంగా అక్రమ నిర్మాణాలు చేపడితే తప్పకుండా వాటిని కూల్చి వేయవలసిందే. దీనికి సామాన్య ప్రజల నుండి హృదయ పూర్వకంగా అభినందనలు ప్రభుత్వానికి వస్తున్నాయి. హైదరాబాద్ భాగ్యనగరంగా ప్రసిద్ధి. నిజాం రాజ్యానికి రాజధాని. 500 సంవత్సరాల పైబడిన పురాతన చారిత్రక నగరం. ఈ నగరం ఇప్పుడు సురక్షత, ఆవాసయోగ్యమైన, విశ్వనగరంగా విఖ్యాతి గాంచింది. ఈ మహానగరంలో ఒక్క తెలుగు వారే కాక దేశంలోని ఇతర ప్రాంతాల ప్రజలు ఉద్యోగ, ఉపాధి కోసం వచ్చి ఇక్కడ స్థిరపడ్డారు. చిరు వ్యాపారం చేసుకునే వారి సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. కోటికి పైగా జనాభా వున్న రాజధానిలో ఫ్లోటింగ్ పాపులేషన్ కూడా సుమారు 1 లక్షా 50 వేల మంది ఉంటారని ప్రభుత్వ అంచనా. వీరందరికి తగినంతగా తాగు నీరు, ఇతర అవసరాలకు సరిపడా నీటి వసతి అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను, తర్వాత తెలంగాణను వరుసగా పాలించిన ప్రభుత్వాలు.. చెరువులపై అక్రమ నిర్మాణాలకు అలవోకగా అనుమతులిచ్చేశాయి. దీంతో వర్షాకాలంలో నీరు సహజంగా ప్రవహించి చెరువులలోకి చేరకుండా ఈ అక్రమ కట్టడాలు అడ్డుకుంటున్నాయి. దీంతో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరుగుతుంది. ట్రాఫిక్ నిలిచిపోయి ప్రజా జీవితం దుర్భర మౌతుంది.నీటి వనరుల పరిరక్షణే ధ్యేయంగా ఏర్పరచిన హైడ్రా ఉద్దేశం చాలా మంచిది. నిబంధనలను ఉల్లంఘించి, చట్ట వ్యతిరేకంగా అక్రమ నిర్మాణాలు చేపడితే తప్పకుండా వాటిని కూల్చి వేయవలసిందే. అందుకే ప్రభుత్వానికి సామాన్య ప్రజల నుండి హృదయ పూర్వకంగా అభినందనలు వస్తున్నాయి. గతంలో హైకోర్టు, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులు కూడా సానుకూలంగా ఉన్నాయి. ప్రభుత్వ, ప్రజల ఆస్తుల పరిరక్షణ ప్రస్తుత, భవిష్యత్ తరాలకు ప్రకృతి వనరుల పరిరక్షణ అవసరం. అయితే హైడ్రా పనితీరుపై కొన్ని విమర్శలు వస్తున్నప్పటికీ హైడ్రా సృష్టిస్తున్న సంచలనం అంతా ఇంతా కాదు. అయితే ఈ ప్రక్రియ ఆరంభ శూరత్వం కాకూడదు. ఇకముందు అక్రమ కట్టడాలు లేకుండా ప్రభుత్వ ఆస్తులకు కంచెలు వేయాలి. సైన్ బోర్డులు తగిలించాలి. నిష్పాక్షికంగా, పారదర్శకంగా, రాజకీయ పార్టీలకు అతీతంగా హైడ్రా చట్టబద్ధంగా పనిచేయాలి. అది నిరూపించడం కోసం మొదట కాంగ్రెస్ నాయకుల ఆక్రమణలపై కూల్చివేతలు ప్రారంభించి, విపక్షాల అక్రమ కట్టడాల జోలికి వెళ్లాలి. ప్రభుత్వం తనవారు, పరాయివారు అనే పక్షపాతం ఎట్టి పరిస్థితుల్లో చూపరాదు. చెరువులు, కుంటలు, ఇతర సహజ వనరుల రక్షణ చేపట్టాలి. ధనికులకు, పారిశ్రామిక వేత్తలకు, సినీ సెలబ్రిటీలకు అనుచిత మర్యాదలు చూపి చట్ట వ్యతిరేక చర్యలకు మద్దతు ఇవ్వరాదు. రాగ ద్వేషాలకు, రాజకీయ కక్ష సాధింపులకు హైడ్రాను వాడరాదు. స్వపక్షం, విపక్ష హోదాలకు అతీతంగా హైడ్రా పనిచేయాలి. అయితే, ఇప్పటికే అక్రమ కట్టడాలలో ఇళ్లు కొనుక్కున్న వారికి బిల్డర్స్ ఆస్తులను జప్తు చేసి నష్టపరిహారం ఇవ్వాలి. పేదవారి ఇళ్లను కూల్చినప్పుడు వారికి వెంటనే ప్రభుత్వ భూమి ఇవ్వాలి. లేదా ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి. లేదా తగిన నష్టపరిహారం వెంటనే చెల్లించాలి. బిల్డర్లతో కుమ్మక్కై ఇష్టారీతిన రిజిస్ట్రేషన్లు, లేఅవుట్ పర్మిషన్లు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలి. వారి ఆస్తులు జప్తు చేసి, జైలుకు పంపాలి. చెరువులపై కట్టిన కట్టడాలను కూల్చినప్పుడు కట్టడాల వ్యర్థాలను తీసివేసి చుట్టూ కంచె వేసి, పరిసర కాలనీ వాసులకు చెరువుల పరిరక్షణా బాధ్యతలను అప్పగించాలి. ప్రతి జిల్లాలోనూ హైడ్రా వంటి సంస్థలను ఏర్పాటు చేయాలి. చెరువులు, కుంటలు, నాలాలు చెక్ డ్యాముల పరిరక్షణకు, ప్రభుత్వ ఆస్తుల రక్షణకు ప్రజా సంఘాలను ఏర్పాటు చేసి వారికి బాధ్యత, అధికారాలు అప్పగించాలి. ప్రభుత్వ చిత్తశుద్ధే హైడ్రా విజయానికి ఆధారమవుతుంది.

# పాలకుల్లోనే పాపిష్టులు..

ప్రపంచ ఆధునికతను అందుకుంటూ దేశం ఎంత ముందుకు వెళ్తున్నా.. మానవ విలువలు అదే రీతిలో పతనమవుతూ వస్తున్నాయి. దేశంలో అవినీతి, అక్రమాలు, నేరాలు, లంచాలతో సమాజాన్ని, సామాన్య జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేసి ఊపిరాడకుండా చేసేవారు పెరిగిపోతున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల నుంచి మొదలుకొని చట్టాలు చేసే ప్రజాప్రతినిధుల దాకా ఈ పరిధి విస్తరించి ఉంది. అందుకే న్యాయం జరగాల్సిన చోటా... లంచానికి న్యాయం అమ్ముడుపోయి అన్యాయం విర్రవీగుతుంది. బాధ్యతగా ఉండాల్సిన అధికారులు నీతి తప్పితే ఇక సామాన్యుల బతుకులు ఎప్పుడు బాగుపడతాయి. దేశంలో అవినీతితో పాటు ఈ మధ్య భయంకరంగా పెరిగిపోతున్న లైంగిక దాడులు తీవ్ర భయాందోళనలకు గురిచేసేలా మారాయి. లైంగికదాడులను అరికట్టడానికి ఎంత ప్రయత్నం చేసినా, అందుకు ఎన్ని చట్టాలు ఉన్నా.. అవి నియంత్రణలోకి రాలేకపోతున్నాయి. ఏదోచోట మహిళలు లైంగిక దాడులకు గురవుతూ, మానసిక వేధింపులకు బలవుతున్నారు. పాఠశాలలు, కళాశాలలు, చివరికి రక్షించాల్సిన పోలీస్ స్టేషన్లలోనూ ఇటువంటి ఘటనలు జరగడం ఘోరమైన పరిస్థితి. నేరచరిత్ర ఉన్నవారు కూడా యథేచ్ఛగా ప్రజా ప్రతినిధులుగా ఉన్నప్పుడు ఇక న్యాయం జరుగుతుందని ఎలా అనుకుంటాం? గ్రామ స్థాయిలో సర్పంచిగా ఎన్నికలలో పోటీచేసేందుకు ముగ్గురు సంతానం ఉంటే అర్హత ఉండదు. అలాంటిది మహిళలపై నేరాలకు పాల్పడిన వారు చట్టసభల్లో ఉండడం నిజంగా దౌర్భాగ్యం. సువిశాల



భారతదేశంలో.. నాయకత్వం ఇప్పుడు కొందరికి ఆస్తులు కాపాడుకోవడానికి మరికొందరికి ఆస్తులు సమకూర్చుకోవడానికి వేదికగా మారినట్లు తయారైంది. దేశంలో ఓ వైపు ఆకలి కేకలు పెరిగిపోతుంటే అంతే స్థాయిలో అవినీతి, దోపిడి రాజ్యమేలుతున్నాయి. ఫలితంగా పేదోడు ఆకలితో యుద్ధం చేయాల్సిన దౌర్భాగ్యపు పరిస్థితులు దాపురించాయి. వారి సంక్షేమం కోసం ఎన్ని పథకాలు తెచ్చినా.. అవి పేదోడికి అందాల్సినంత అందడం లేదు. దేశంలో హత్యాచార ఘటనలు నిత్యం ఏదో చోట జరుగుతూనే ఉన్నాయి. మహిళలపై నేరాలకు పాల్పడిన ఘటనల్లో 151 మంది ప్రజాప్రతినిధులుగా ఎంపికై వివిధ హోదాల్లో చట్టసభల్లో ఉన్నారు. అందులో 135 మంది ఎమ్మెల్యేలు ఉండగా 16 మంది ఎంపీలుగా ఉన్నట్లు అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్ నివేదిక తెలియజెప్పింది. రాజకీయ పార్టీలు వారిపై ఎన్ని కేసులున్నా వారికే టికెట్లు ఇచ్చి అభ్యర్థులుగా బరిలో నిలబెడతాయి. మనం వారిని గెలిపిస్తే వారు ప్రజాప్రతినిధులుగా ఎన్నికై వారి పాపాలను చెరిపేసుకునే పనిలో ఉన్నారు. అందుకే దేశంలో రాజకీయ వ్యవస్థ బాగుపడనంత కాలం.. సమాజంలో గుణాత్మక మార్పును తీసుకురాలేం. నేరాలను అదుపు చేయడానికి ఎన్ని వ్యవస్థలు ఏర్పాటు చేసినా వారిలో మార్పు రాకుండా సమాజంలో మార్పు వస్తుందనుకోవడం భ్రమ. టెక్నాలజీలో ప్రపంచ దేశాలతో పోటీపడుతున్న మనం మానవ విలువలు కోల్పోతున్నాం. అంతరిక్షానికి ఎక్కడాన్ని నేర్చుకుంటున్న మనం భూమి మీద మనుషులుగా ఎలా వ్యవహరించాలో మరిచి బాధ్యతారాహిత్యంగా ఉంటున్నాం. మనం ఇప్పటికైనా సమాజం పట్ల పౌరులుగా బాధ్యతతో వ్యవహరించాలి. అవినీతిని అడ్డుకొని, నీతిలేని రాజకీయ నాయకులకు గుణపాఠం చెప్పుకుంటే.. మనం మనసున్న మనుషులం కానే కాదు.

# సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వాంతులు, విరోచనాలు తదితర లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి

చింతపల్లి మాజీ సర్పంచ్ ముచ్చర్ల యాదగిరి



**చింతపల్లి, సెప్టెంబర్ 1 శాసనసభ న్యూస్ ప్రతినిధి:** చింతపల్లి మండల ప్రజలు తమ ఆరోగ్యమును పదిలం చేసుకోవాలని, పలు విషయాలను చింతపల్లి మాజీ సర్పంచ్ ముచ్చర్ల యాదగిరి తెలియజేశారు. ప్రస్తుతం డయేరియా అనే వ్యాధి రావడం జరుగుతోందని, డయేరియా అనగా వాంతులు, బేదులు అధికంగా కావడం అని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ, ఇంటిని కూడా పరిశుభ్రం చేసుకోవాలన్నారు. బయట పెట్టే తొట్లలో నీరునిల్వ ఉండరాదని, ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని తెలిపారు. తాగునీటిని వేడి చేసి, చల్లార్చి ,తాగాలని తెలిపారు. బయట ఫాస్ట్ ఫుడ్ తినేఅలవాటును చాలా తగ్గించుకోవాలని తెలిపారు. ఎప్పటికప్పుడు చేతులను పరిశుభ్రంగా కడుక్కోవాలని, లేనియెడల అనారోగ్యం చోటుచేసుకునే అవకాశం ఉందని తెలిపారు. వేడిగా ఉండే ఆహారాన్ని మాత్రమే భుజించడం వల్ల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని, సాధ్యమైనంతవరకు ఇంటిలోని ఆహారాన్ని మాత్రమేతినేలా అందరూఅలవాటు చేసుకోవాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రభలుతున్నా యని, ప్రజలు ముందస్తుగా తగినజాగ్రత్తలు పాటించి, వైద్యుల యొక్క సలహా సూచనలు తప్పక అమలు చేయాలని తెలిపారు. దోమల నివారణపై దోమతెరలు వాడుటమే గాక, వేపాకు పొగను వేసుకోవడంలాంటివి చేసినప్పుడు అనారోగ్యాలు దరిదాపున చేరవని తెలిపారు. ప్రస్తుతం నియోజకవర్గ వ్యాప్తంగా డయేరియా కేసులు నమోదవుతున్నాయని తెలుస్తోందన్నారు.సంబంధిత వైద్యులు కూడా ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన తెలిపారు. ఇప్పటికే పలు వార్డులలో పారిశుధ్యం పైన ప్రత్యేక అధికారులు దృష్టి సారించడం జరిగిందని తెలిపారు. చెత్తాచెదారం, కాలవలో మురికినీరు, దోమల బెడదతో ఇబ్బందులు ఉన్నట్లయితే అధికారులకు తెలియజేయాలన్నారు. ప్రతిఒక్కరూ ఓ ఆర్ ఎస్ ను తప్పక సేవించాలని జింక్ కార్నర్ తో ఇప్పుడు నీళ్ల విరోచనాలు మటుమాయం అవుతాయని తెలిపారు. విరోచనాలు మొదలైన వెంటనే ఓఆర్ఎస్ ను తీసుకోవాలని తెలిపారు. కుటుంబంలోని చిన్నపిల్లల పట్ల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ప్రత్యేకమైన శ్రద్ధను తప్పక కనబరచాలని తెలిపారు. మండలం లోని వివిధ గ్రామాల ప్రజలకు అనారోగ్యం వచ్చినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోనూ, పట్టణ ప్రభుత్వ ఆసుపత్రులలోనూ చేరి వెంటనే వైద్య చికిత్సలు పొందాలని చింతపల్లి మాజి సర్పంచ్ ముచ్చర్ల యాదగిరి తెలిపారు.

# పాలమాకుల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఆకస్మిక తనిఖీ





**రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్, సెప్టెంబర్ 1 శాసనసభ న్యూస్ ప్రతినిధి:** ఆదివారం రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ, జిల్లా ఇంఛార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పాలమాకుల గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయ (కేజీబీవీ) పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు విద్యార్థినిలతో మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు అందిస్తున్న ఆహారం గురించి, వారికి కల్పిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. కస్తూర్బా గాంధీ విద్యార్థినిల పట్ల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించిన టీచర్ల పై తగిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి సమస్య ఇంకా ముందు పునరావృత్తం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ శశాంక కు మంత్రి సూచించారు. విద్యార్థినులకు కావలసిన మౌలిక వసతులను, సౌకర్యాలను అందిస్తామని తెలిపారు. విద్యార్థుల మెస్ చార్జీలు గ్రీన్ ఛానల్ లో ఉంచామని మంత్రి తెలిపారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, రాష్ట్ర ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బుర్ర జ్ఞానేశ్వర్, రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, డీఈవో సుసిందర్ రావులు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మంత్రి వెంట జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, రాజేందర్ నగర్ శాసన సభ్యులు ప్రకాష్ గౌడ్, రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్, జిల్లా విద్యాశాఖ అధికారి సుసింధర్ రావు , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శంకర్పల్లి మండలంలో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షం







పొంగిపొర్లిన మూసి వాగు....

పొద్దుటూరు వద్ద రాకపోకలను నిలిపివేసిన పోలీసులు...

**శంకర్పల్లి: సెప్టెంబర్ 1:( స్వచ్ఛ తెలంగాణ )** గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి పత్తేపుర వద్ద మూసి వాగు ఉధృతంగా ప్రవహించి పొంగిపొర్లింది. వికారాబాద్, అనంతగిరి, నవాబుపేట్ తదితర ప్రాంతాలు అధికంగా వర్షం కురవడంతో శనివారం రాత్రి నుంచి మూసికి వరద పోటెత్తింది. మొదటిసారిగా మూసి వాగు ఉధృతంగా ప్రవహించడంతో మూసిని చేసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున పత్తేపురం బ్రిడ్జిపై కి చేరుకున్నారు. కాగా మండలంలోని ప్రొద్దటూరు గ్రామం వద్ద ఉన్న మూసి వాగు ఉదయం నుంచి వంతెన పైనుంచి పెద్ద ఎత్తున నీరు పారుతుండడంతో మోకిలా పోలీసులు వాగు వద్ద బందోబస్తు నిర్వహించి రాకపోకలను నిలిపివేశారు. కాగా టంగటూరు గ్రామ శివారులో మూసి ఉధృతంగా ప్రవహించడంతో నీరు పంట పొలాల్లోకి చేరాయి. ప్రొద్దటూరు గ్రామ శివారులోని మూసి పరివాహక ప్రాంతంలో వరద నీటిలో ఇరుక్కుపోయిన ఒక కుటుంబాన్ని మోకిల సిఐ వీరబాబు ఆధ్వర్యంలో వారిని బయటకు తీసుకువచ్చారు. శంకర్ పల్లి- హైదరాబాద్ ప్రధాన రోడ్డులో మిర్జాగూడ గ్రామ స్టేజి వద్ద పెద్ద ఎత్తున వరద నీరు చేరి వాహన రాకపోకలకు ఇబ్బందులు కలగడంతో పోలీసులు జెసిబి సాయంతో కాలువ తీసి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.

**నాలా లు మూసివేయడంతో విల్లాల లోకి చేరిన వరద నీరు....**

మోకిల గ్రామ శివారులోని నాలాలను వెంచర్ యాజమాన్యం కబ్జా చేసి మూసి వేయడంతో వరద నీరు పెద్ద ఎత్తున విల్లాలలోకి చేరింది. దీంతో ల పోలమా విల్లాలలో ఉంటున్నప్రజలు బయటకు వెళ్లకుండా విల్లాల లో ఉండిపోయారు. రోడ్లపై ఉన్న కార్లు మొత్తం సగం వరకు నీటి మునిగాయి. దీంతో ప్రజలు భయాందోళనతో బిక్కుబిక్కుమంటున్నారు.

# గిరిజన విశ్వవిద్యాలయ ప్రకటన ఏమైంది?

కేంద్ర ప్రభుత్వం 2014లో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (ఎ.ఐ.ఐ.ఎం.ఎస్), కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం అనే జాతీయ విద్యా సంస్థలను ఒకేసారి ఆంధ్ర ప్రదేశ్‌కు మంజూరు చేసింది. కానీ రూ. 834 కోట్లు ఎస్టిమేషన్ కలిగిన గిరిజన విశ్వవిద్యాలయం ఎక్కడ నిర్మించాలి అన్న దానిపై ఇంకా చర్చ కొనసాగుతోంది. యూనివర్సిటీకి నిధుల కేటాయింపులు కూడా ప్రతి ఏడాది తగ్గుతున్నాయి. 2015లో రూ. 834 కోట్లు కేటాయించి మొదటి విడత కింద రూ. 420 కోట్లు విడుదల చేసింది. 2023 సంవత్సరంలో సవరించిన బడ్జెట్‌లో రూ.40.67 కోట్లు కేటాయించారు. కానీ ఖర్చు జరగలేదు. ఈ ఏడాది ఏకంగా బడ్జెట్‌లో యూనివర్సిటీకి ప్రత్యేకించి ఎటువంటి కేటాయింపులు జరగలేదు. యుజిసి నిధుల నుండి కేటాయిస్తామని చెబుతుంది. పోనీ ఆ యుజిసి నిధులేమైనా పెంచారా అంటే అదీ లేదు. గతంలో యుజిసికి రూ. 6409 కోట్లు కేటాయిస్తే ఈ సంవత్సరం 60.99 శాతం కోత విధించి కేవలం రూ.2500 కోట్లు కేటాయించారు. ఇందులో గిరిజన విశ్వవిద్యాలయంకు ఎంత ఖర్చు చేస్తారో వేచి చూడాలి. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం విజయనగరంలో కొత్తవలస సమీపంలోని రెల్లి గ్రామంలో నిర్మించాలని గతంలో టిడిపి ప్రభుత్వం నిర్ణయించింది. 2015లో అక్కడ రైతుల నుండి 520 ఎకరాలు భూమిని సేకరించింది. కానీ దానికి రైతులకు ఎటువంటి పరిహారం చెల్లించలేదు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులలో రూ. 5 కోట్లు ఖర్చు చేసి భూమి చుట్టూ ప్రహరీ నిర్మించి చేతులు దులుపుకుంది. 'రెల్లిలో సేకరించిన భూమిలో ఎక్కువ శాతం జిరాయితీ భూమి. పరిహారం ఎక్కువ ఇవ్వాల్సి వుంటుంది. అందుకనే రెల్లి నుండి యూనివర్శిటీని మెంటాడలోని కుంఠినివలస దగ్గరకు మార్చామ'ని 2019లో నూతనంగా వచ్చిన వై.ఎస్.ఆర్.సి.పి ప్రభుత్వం చెప్పింది. అక్కడ రైతుల దగ్గర నుండి 563 ఎకరాలు భూమి సేకరించి నష్టపరిహారం కూడా 90 శాతం చెల్లించింది. 4 సంవత్సరాలు పాటు కాలయాపన చేసి ఎన్నికలు వస్తున్నాయనగా హడావుడిగా కేంద్రమంత్రి ధర్మేందర్ ప్రధాన్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఆ తరువాత మళ్లీ ప్రభుత్వం మారింది. 2024లో టిడిపి కూటమి అధికారంలోకి వచ్చింది. ఎస్.కోట ఎంఎల్ఏ కోళ్ల లలిత కుమారి యూనివర్సిటీ నిర్మాణం గతంలో అనుకున్న రెల్లిలోనే ఏర్పాటు చేస్తామని దానికి ముఖ్యమంత్రి, విద్యా శాఖమంత్రి కూడా ఆమోదం తెలిపారని ప్రకటించారు. ఈ మధ్య గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కుంఠినివలసలో జరిగిన గ్రామ సభలో మాట్లాడుతూ యూనివర్సిటీ రెల్లిలో ఏర్పాటు చేస్తారని చేస్తున్న ప్రచారం వాస్తవం కాదని ఇక్కడే ఏర్పాటు చేస్తామని, అందులో ఉద్యోగాల్లో స్థానికులకు ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. అంతకు ముందు రోజే జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో యూనివర్శిటీ పనులు వేగవంతం చేస్తామని తెలిపారు. నీటి సరఫరాకు 4 కోట్లు, విద్యుత్ సరఫరాకు రూ.3.6 కోట్లు, రోడ్డుకు పరిహారం చెల్లించడానికి రూ.2.6 కోట్లు అవసరమౌతాయని తెలిపారు. యూనివర్శిటీ మంజూరైనప్పటి నుండి ఇటువంటి ప్రకటనలు అనేకం వస్తున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు పని మాత్రం ముందుకు కదలడం లేదు. 2019 నుండి యూనివర్సిటీ ఏ.యు భవనంలో తాత్కాలికంగా తరగతులు నడుస్తున్నాయి. సుమారు 250కు పైగా విద్యార్థులు చదువుతున్నారు. మన రాష్ట్రంతో పాటు కేరళ, కర్ణాటక, ఒడిస్సా వంటి ఇతర రాష్ట్రాల నుండి కూడా విద్యార్థులు ఇక్కడకు వచ్చి చదువుతున్నారు. వీరికి సరిపడా సదుపాయాలు లేవు. వసతి సదుపాయం లేక దగ్గరలో ఓ ప్రైవేట్ కాలేజీ హాస్టల్‌లో ఉంటున్నారు. అక్కడ రూ. 60,000 వరకు ఫీజులు వసూలు చేస్తున్నారు. అంతంత ఫీజులు కట్టుకోలేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

## కొండ భీమనపల్లి గురుకుల పాఠశాలను సందర్శించిన బిఆర్ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు



**దేవరకొండ, సెప్టెంబర్ 1 శాసనసభ న్యూస్ ప్రతినిధి:** దేవరకొండ నియోజకవర్గంలోని కొండభీమనపల్లి బీసీ గురుకుల పాఠశాలలో రాత్రి పూట నిద్రిస్తున్న విద్యార్థులను ఎలుకలు కరవడంతో 14 మంది విద్యార్థులు గాయపడడంతో గురుకుల పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో మాట్లాడి, సమస్యలను అడిగి తెలుసుకున్న మాజీ మంత్రులు. అనంతరం పత్రిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ గురుకుల పాఠశాలలో ఇలాంటి సంఘటన చోటు చేసుకోవడం దాన్ని గమనించకుండా ఉండడం సంబంధిత పాఠశాల అధికారులదేనని తేల్చేశారు. ఈ విషయంపై తగిన విచారణ జరపాలని, మాజీ మంత్రులు తన్నీరు హరీష్ రావు,గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి,గంగుల కమలాకర్,%=ా% ప్రవీణ్ కుమార్ ,బిఆర్ఎస్ నల్గొండ జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్ర కుమార్,మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్,భాస్కర్ రావు,ప్రభాకర్ రెడ్డి,భూపాల్ రెడ్డి,సుదర్శన్ రెడ్డి, పాల్గొన్నారు.

## ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వలన 7, 8 వార్డులను సందర్శించిన : శంకర్పల్లి మున్సిపల్ కమిషనర్ జి శ్రీనివాస్.....






**శంకర్పల్లి :** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు నేపథ్యం లో ప్రజలు అప్రమత్తంగా ఉండా లని శంకర్ పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం ఫతేపురం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మూసి వాగును ఆయన పరిశీలించారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని 7, 8 వార్డులలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను పరిశీలించి ఇళ్లల్లో ఉన్నవారితో మాట్లాడారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లను ప్రజలు వెంటనే ఖాళీ చేయాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు అత్యవసర పరిస్థితులలోనే బయటికి రావాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చాకలి అశోక్, రాములు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## శంకర్ పల్లి రైల్వే స్టేషన్‌లో ఎక్స్ప్రెస్, ప్యాసింజర్ రైళ్లు ఆపాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డికి వినతిపత్రం అందించిన బిజెపి నాయకులు.



**శంకర్పల్లి :** ప్రయాణికుల సౌకర్యార్థం శంకర్ పల్లి రైల్వే స్టేషన్ లో బీజాపూర్ ప్యాసింజర్, వాడి ప్యాసింజర్, హుబ్లీ-సికింద్రాబాద్ ఎక్స్ప్రెస్, ఎల్ టీటీ ఎక్స్ప్రెస్ లో ఆపాలని ఆదివారం శంకర్ పల్లి మండల బిజెపి నాయకులు చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డికి ఆయన స్వగృహంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రైళ్లు శంకర్పల్లి స్టేషన్లో ఆపితే ఉద్యోగులు, వ్యాపారస్తులు, విద్యార్థులకు ఎంతో సౌకర్యం ఉంటుందని తెలిపారు. ఈ రైలు శంకర్ పల్లి రైల్వే స్టేషన్ లో నేర్పకపోవడంతో వారు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేద వ్యక్తం చేశారు. కాగా దక్షిణ మధ్య రైల్వే జీఎంతో కలిసి రైళ్లకు సంబంధించిన వివరాలను తెలుపుతానని ఎంపీ అన్నారని చెప్పారు. తప్పకుండా ఈ రైళ్లు శంకర్ పల్లి రైల్వే స్టేషన్లో ఆగేలా చర్యలు తీసుకుంటామని ఎంపీ హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కె ఎస్. రత్నం, రాష్ట్ర బిజెపి సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, మండల బిజెపి అధ్యక్షులు బసగాళ్ల రాములు గౌడ్, శంకర్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దేవుని పరమేశ్వర్ రెడ్డి, మున్సిపల్ బిజెపి ఇంచార్జ్ వాసుదేవ్ కన్నా, మాజీ ఎంపీపీ బీర్ల నరసింహ, నాయకులు బయన్న, గడ్డమీది వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటక అభివృద్ధికి అధ్యయనం పట్ల రాచప్ప సమితి హర్షం..



**ఎల్బీనగర్ సెప్టెంబర్ 1 (స్వచ్ఛ తెలంగాణ ప్రతినిధి)** పర్యాటక ప్రదేశాలు గుర్తించ అధ్యయనంచేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధికారుల సమీక్ష లో వివరించడం పట్ల రాచ కొండ చారిత్రక, పర్యావరణ,పర్యాటక, పరి రక్షణ సమితి హర్షం వ్యక్తం చేసింది, ఈ మేరకు సమితి ప్రధాన సలహా దారులు కడారు అంజి రెడ్డి ఒక ప్రకటన విడుదల చేస్తూ టెంపుల్, హెల్త్ టూరిజం, ఎకో టూరిజం నకు చారిత్రక రాచకొండ ఏంతో అనువైన ప్రదేశం అని, నగరానికి అత్యంత సమీపం లో ఉందని, అధికారులు రాచ కొండ పట్ల ,రాచకొండ పర్యాటక అభివృద్ధి పట్ల, చిన్న చూపు చూసి నిర్లక్ష్యం వహించారని, గ్రీన్ సిటీ, టెంపుల్ సిటీ, హెల్త్ సిటీ గా అభివృద్ధి చేయాలనీ,ప్రభుత్వానికి ఆదాయం తో పాటు, ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని తెలిపారు, ముఖ్యమంత్రి తక్షణమే చొరవ తీసుకుని, అభివృద్ధి చేయ, అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసి చర్యలు చేపట్టాలని వారు వివరించారు, ముఖ్యమంత్రి కి రాచ కొండ పట్ల మంచి ఆలోచన, అవగాహన ఉందని వారు పేర్కొన్నారు,

# బిలీయనీర్స్‌లో ముంబై తర్వాత హైదరాబాదే

**హైదరాబాద్ :** ఇండియాలో బిలియనీర్లు పెరుగుతున్నారా? స్టాక్ మార్కెట్ రాకెట్ మాదిరిగా దూసుకుపోతోంది.. మరి బిలియనీర్ల మాటేంటి? ఇండియాలో ఎవరు కుబేరులయ్యారు? టాప్‌లో ఏ సిటీ ఉంది? ఇందులో హైదరాబాద్ స్థానమెంత? చివరి స్థానం ఎవరు? చాలామంది టాప్ ఉన్నత స్థాయి వర్గాలు చ ర్చించుకుంటున్నాయి. తాజాగా హురూన్ ఇండియా ఫుల్‌స్టాప్ పెట్టిందా? లోతుల్లోకి వెళ్దాం..చైనా రాజధాని బీజింగ్ బిలియనీర్లు కేరాఫ్‌గా మారింది. చైనా రాజధాని బీజింగ్ నుంచి ఎక్కువ మంది బిలియనీర్లు వచ్చేవారు. దాన్ని అధిగమించింది ముంబై సిటీ. ఒకప్పుడు బీజింగ్ నుంచి 91 మంది రాగా, ముంబై 92 మంది బిలియనీర్లకు కేరాప్‌గా మారింది.ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న బిలియనీర్ రాజధానిగా ముంబై మారింది. ప్రపంచంలో బిలియనీర్ల పరంగా చూస్తే న్యూయార్క్ (119) తొలి స్థానం, లండన్ (97) తర్వాత మూడవ స్థానంలో ముంబై నిలిచింది. మరో నాలుగేళ్లలో సెకండ్ ప్లేస్‌కు ముంబై చేరుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2014 పేరుతో దేశంలోని కుబేరుల జాబితాను విడుదల చేసింది. ఇండియాలో అత్యంత సంపద కలిగిన వ్యక్తిగా బిజినెస్ మేన్ అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ టాప్ వన్‌లో నిలిచారు. సంపద విలువ ఏడాది కాలంలో 95శాతం పెరిగి అక్షరాలా 11.6 లక్షల కోట్లకు చేరింది. ఆ తర్వాత ముకేష్ అంబానీ 10.14 లక్షలో సెకండ్ ప్లేస్‌లో నిలిచారు.పదేళ్ల కిందట టాప్ -10లో ఉండే అదానీ, ఇప్పుడు ఫస్ట్ ప్లేస్ దక్కించుకున్నారు. ఆ తర్వాత హెచ్‌సీఎల్ అధినేత శివనాడార్, సీరమ్ ఇన్‌స్టిట్యూట్, సన్ ఫార్మాలు వరుసగా మూడు, నాలుగైదు స్థానాల్లో నిలిచారు. రాష్ట్రాల పరంగా చూస్తే కుబేరుల జాబితాలో మహారాష్ట్ర తొలిస్థానం సొంతం చేసుకుంది. ఆ తర్వాత ఢిల్లీ, గుజరాత్, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలు



వరసగా నిలిచాయి. టాప్ 10లో ఏపీ చోటు దక్కలేదు. నాలుగేళ్ల కిందట ఆరో స్థానంలో నిలిచిన తెలంగాణ.. ఇప్పుడు ఐదుకి ఎగబాకింది.బిలియనీర్లకు కేరాఫ్‌గా మెట్రోపాలిటిన్ సిటీలు నిలుస్తున్నాయి. 386 మంది బిలియనీర్లతో ముంబై అగ్రస్థానం దక్కించుకుంది. నాలుగేళ్ల కిందట 217 మంది మాత్రమే ఉండేవారు. సెకండ్ ప్లేస్‌లో న్యూఢిల్లీ నిలిచింది. 217 మంది బిలీయనీర్లు అక్కడి నుంచి వచ్చారు. నాలుగేళ్ల కిందట అందులో సగం ఉండేది. కుబేరు లకు కేంద్రంగా మారుతోంది హైదరాబాద్. ధనవంతుల సంఖ్య ఏడాదికేడాది పెరుగుతూ వస్తోంది. నాలుగేళ్ల కిందట కేవలం హైదరాబాద్ నుంచి 50 మంది మాత్రమే ఉండేవారు.. ప్రస్తుతం 104 మంది బిలియనీర్లు ఉన్నారు. ఈ విషయంలో బెంగుళూరును వెనక్కి నెట్టేసింది. దీని తర్వాత బెంగుళూరు 100 మందితో నాలుగులో స్థానంలో నిలిచింది. తర్వాత చెన్నై నిలిచింది.తెలంగాణ నుంచి దివీస్ లేబరేటరీస్, పిచ్చిరెడ్డి-మేఘా ఇంజనీరింగ్, కృష్ణారెడ్డి-మేఘా ఇంజనీరింగ్, పార్థసారథి-హెటెరో ల్యాబ్స్, అపర్ణ కన్ స్ట్రక్షన్స్, ఎంఎస్ఎన్ ల్యాబ్స్ వంటి కంపెనీలు నిలిచాయి. కొత్తగా ఏర్పడిన తెలంగాణ బలమైన ఆర్థిక శక్తిగా నిలుస్తోందని చెప్పవచ్చు.

# హైడ్రా పొలిటికల్ టచ్ ఇస్తోందా

**హైదరాబాద్ :** తెలంగాణ రాజధాని హైదరాబాద్ ఒకప్పుడు చెరువులు, కుంటలతో విలసిల్లేది. ఎప్పుడైతే అభివృద్ధి చేస్తామని పాలకులు కంకణం కట్టుకున్నారో.. అప్పటి నుంచి హైదరాబాద్ తన రూపును కోల్పోవడం ప్రారంభమైంది. చెరువులు నాశనమయ్యాయి. కుంటలు కాలగర్భంలో కలిసిపోయాయి. నాలాలు నామరూపాలను కోల్పోయాయి. ఫలితంగా వర్షం కురిస్తే చాలు హైదరాబాద్ నగరం నీట మునిగిపోతోంది. ఒకప్పుడు చెరువులతో అద్భుతమైన ప్రాంతంగా ఉన్న హైదరాబాద్.. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు చిగురుటాకులా వణికి పోతోంది. తెలంగాణ ఏర్పాటైన తర్వాత.. చెరువులను చెరబట్టి ఆక్రమించిన నిర్మాణాలను పడగొట్టేందుకు అప్పటి ప్రభుత్వం ప్రయత్నించింది. కానీ చివరి నిమిషంలో విరమించుకుంది. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ఆధ్వర్యంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం హైదరాబాద్ నగరంలో చెరువుల పరిరక్షణ కోసం, ఆక్రమణలను తొలగించేందుకు హైడ్రా అనే వ్యవస్థను ఏర్పాటు చేసింది. దీనికి చైర్మన్ గా సీనియర్ ఐపీఎస్ అధికారి రంగనాథ్ ను నియమించింది.. బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి రంగనాథ్ ఆధ్వర్యంలో హైడ్రా హైదరాబాద్ నగరంలో చెరువుల్లోని ఆక్రమణలను క్రమంగా తొలగిస్తోంది.. చెరువులను చెరబట్టారని తెలిస్తే చాలు కూల్చి పడేస్తోంది. ఇందులో పార్టీలతో సంబంధం లేకుండా హైడ్రా దూసుకు వెళ్తోంది. మొదట్లో దీనికి ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి నాయకులు రాజకీయరంగు పులిమేందుకు ప్రయత్నించారు. ఈ ఆరోపణలను తిప్పికొడుతూ హైడ్రా కాంగ్రెస్ నాయకుడు పల్లంరాజు సోదరుడి నిర్మాణాలను మొదట కూల్చేసింది.. స్వపక్షమైనా, విపక్షమైనా.. నీటి వనరులను ఆక్రమిస్తే పడగొడతామని రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను హైడ్రా నిజం చేసి చూపించింది.ఢిల్లీలోని ఎమరాల్డ్ ప్రాంతంలో ట్విన్ టవర్స్ నిర్మించారు. ఇది అక్రమం అని తేలడంతో 2012లో ఆ ప్రాంతవాసులు కోర్టును ఆశ్రయించారు. ఆ నిర్మాణాలు అక్రమమని 2014లో అలహాబాద్ కోర్టు తీర్పు ఇచ్చింది. ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది.. అయితే వీటిని కూల్చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో వీటిని నిర్మించిన సూపర్ టెక్ అనే కంపెనీకి ఎదురు దెబ్బ తగిలింది. ఈ ట్విన్ టవర్స్ ఢిల్లీలోని కుతుబ్ మినార్, ఇండియా గేట్ కంటే ఏడు మీటర్ల ఎత్తులో ఉండడంతో కూల్చేశారు. కేవలం ఏడు మీటర్ల



ఎత్తులో ఉన్న భవనాలను కూల్చివేసినప్పుడు.. చెరువులను కబ్జా చేసి.. నిర్మించిన భవనాల విషయంలో ఎందుకు ఉదాసీన వైఖరి ప్రదర్శించాలని రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగానే అక్రమం అని తేలితే కూల్చి పడేస్తోంది.రాష్ట్రంలో హైడ్రా చేస్తున్న ఆపరేషన్లకు ప్రజల నుంచి ఆదరణ లభిస్తోంది. సినీ హీరో నాగార్జున నిర్మించిన ఎన్ కన్వెన్షన్ సెంటర్ పడగొట్టినప్పుడు ప్రజల నుంచి విశేషమైన స్పందన వచ్చింది. అయితే దీనిని ఒక్క భారత రాష్ట్ర సమితి మాత్రమే వ్యతిరేకించింది. ఈ కూల్చివేతలకు వ్యతిరేకంగా పోరాడతానని నాగార్జున ప్రకటించినప్పటికీ.. ప్రజల నుంచి పెద్దగా మద్దతు లభించలేదు. మరోవైపు హైడ్రా నిర్వహిస్తున్న పనులకు ప్రజల నుంచి స్పందన లభిస్తోంది. హైడ్రా పని తీరుకు హ్యాట్సాఫ్ చెబుతూ గండిపేట వెల్ఫేర్ సొసైటీ సపోర్ట్ వాక్ కూడా నిర్వహించింది. సపోర్ట్ వాక్ లో హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.హైడ్రా ఇప్పటివరకు 18 ప్రాంతాలలో చెరువుల పరిధిలో 43 ఎకరాల పరిధిలో స్ట్రక్చర్స్ ను నేలమట్టం చేసింది. గండిపేట చెరువు పరిధిలోనే 15 ఎకరాల్లో విస్తరించి ఉన్న నిర్మాణాలను తొలగించింది. కావేరి సీడ్స్ యజమాని భాస్కరరావు, మంథని బీజేపీ నాయకుడు సునీల్ రెడ్డి, బహుదూర్ పూర ఎమ్మెల్యే మహమ్మద్ ముబీన్, ఎంఐఎం ఎమ్మెల్సీ మహమ్మద్ మీర్జా, నందగిరి హిల్స్ లో ఎమ్మెల్యే దానం నాగేందర్ అనుచరుడు, చింతల్ చెరువు లో భారత రాష్ట్ర సమితి నేత రత్నాకరం సాయిరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు పల్లం రాజు సోదరుడికి చెందిన నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. అంతేకాదు సీఎం సొంత సోదరుడు తిరుపతిరెడ్డి కూడా హైడ్రా నోటీసులు అందుకోవడం చర్చనీయాంశంగా మారింది.హిమాయత్ సాగర్ లో ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్సీ గుత్తా సుఖేందర్ రెడ్డి కి ఫామ్ హౌస్ లు ఉన్నాయి.. వీటిని కూల్చే దమ్ము హైడ్రా కు ఉందా? అని భారత రాష్ట్ర సమితి నాయకులు సవాల్ చేస్తున్నారు. ఒకవేళ వీటిని పడగొడితే.. తెర వెనుక లోపాయి కారీ ఒప్పందం కుదిరి ఉంటుందనే ఆరోపణలు లేకపోలేదు. సీపీఐ నారాయణ అన్నట్టు పులి మీద స్వారీ చేస్తున్న రేవంత్ రెడ్డి.. మరి హైడ్రాను ఏ దిశగా పరుగులు తీయిస్తారనేది మరికొద్ది రోజుల్లో తేలనుంది.

# దసరా, దీపావళీ స్పెషల్ ట్రైన్స్ రెడీ

**హైదరాబాద్ :** తెలుగు రాష్ట్రాల ప్రజలు దసరా, దీపావళి పండుగలను ఘనంగా జరుపుకుంటారు. ముఖ్యంగా తెలంగాణలో ఈ పండుగకు ప్రతి కుటుంబ సభ్యుడు ఇంటికి రావాల్సిందే. అంతా కలిసి పండుగ చేసుకోవాల్సిందే అన్నట్టుగా ఉంటుంది. అందుకే దసరా, దీపావళి సమయాల్లో ఏ బస్సు చూసినా ఫుల్ ప్యాక్ అయి రాజధాని నగరం నుంచి జిల్లాలకు తరలుతుంటాయి. ఎంజీబీఎస్, జేబీఎస్ బస్ స్టేషన్‌లలో సీట్ల కోసం పాట్లు మామూలుగా ఉండవు. రైలు మార్గాలు కూడా అంతే. టికెట్లు ఎప్పుడో బుక్ అయిపోయి ఉంటాయి. జనరల్ బోగీల్లో ప్రయాణికులు కిక్కిరిసి వెళుతుంటారు. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని దక్షిణ మధ్య రైల్వే ఒక మంచి కబురు తెలిపింది. రైలు ప్రయాణం చేసే తెలుగు ప్రయాణికులకు గుడ్ న్యూస్ చెప్పింది.దసరా, దీపావళి, ఛత్ పండుగలను దృష్టిలో ఉంచుకుని ప్రయాణిలకు ఆటంకాలు తొలగించాలనే ఆలోచనతో దక్షిణ మధ్య రైల్వే 48 ప్రత్యేక ట్రైన్లను నడుపనుంది. ఎస్‌సీఆర్ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రత్యేక రైళ్ల వివరాలు ఇలా ఉన్నాయి.

**ఎస్‌సీఆర్ ప్రకారం,**

కాచిగూడ నుంచి తిరుపతి(07653) ట్రైన్ అక్టోబర్ 10



నుంచి నవంబర్ 11 వరకు సర్వీసులు అందిస్తుంది. ఈ ట్రైన్ కాచిగూడ వద్ద రాత్రి 10.30 గంటలకు బయల్దేరుతుంది. తర్వాతి రోజు ఉదయం 10.10 గంటలకు గమ్యస్థానం చేరుకుంటుంది. ఈ ట్రైన్ ఆరు గురువారాలు సర్వీస్ అందిస్తుంది. తిరుపతి నుంచి కాచిగూడ (07654) ట్రైన్ అక్టోబర్ 11 నుంచి నవంబర్ 15వ తేదీ (ప్రతి శుక్రవారం సేవలు) వరకు నడుస్తుంది. తిరుపతి స్టేషన్‌లో ఈ ట్రైన్ రాత్రి 8.05 గంటలకు డిపార్చర్ అవుతుంది. తర్వాతి రోజు రాత్రి 9.30 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది. సికింద్రాబాద్ నుంచి నాగర్సోల్ (07517) ఈ సర్వీసు అక్టోబర్ 9వ తేదీ నుంచి నవంబర్ 6వ తేదీ (ప్రతి బుధవారం అందుబాటులో సికింద్రాబాద్ స్టేషన్‌లో అందుబాటులో ఉంటుంది.) వరకు ఉంటుంది. ఈ ట్రైన్ సాయంత్రం 5 గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరి మరుసటి రోజు ఉదయం 8 గంటలకు గమ్యస్థానం చేరుకుంటుంది. నాగర్‌సోల్ నుంచి సికింద్రాబాద్ (07518) సర్వీస్ అక్టోబర్ 10 నుంచి నవంబర్ 7వ తేదీ (ప్రతి గురువారం) వరకు అందుబాటులో ఉంటుంది. ఈ ట్రైన్ రాత్రి 10 గంటలకు బయల్దేరి సికింద్రాబాద్‌కు మరుసటి రోజు ఉదయం 10.50 గంటలకు చేరుకుంటుంది. కాకినాడ టౌన్ నుంచి సికింద్రాబాద్ (07122) ట్రైన్ అక్టోబర్ 7 నుంచి నవంబర్ 4వ తేదీ ( ప్రతి సోమవారం) వరకు సర్వీసులు అందిస్తుంది. సాయంత్రం 6.30 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు గమ్యస్థానం చేరుకుంటుంది. సికింద్రాబాద్ నుంచి కాకినాడ టౌన్ (07188) సర్వీస్ అక్టోబర్ 8 నుంచి నవంబర్ 5వ తేదీ (ప్రతి మంగళవారం) వరకు అందుబాటులో ఉంటుంది. ఉదయం 8 గంటలకు బయల్దేరి అదే రోజు సాయంత్రం 6.45 గంటలకు చేరుకుంటుంది. ఈ ప్రత్యేక ట్రైన్‌లలో ఫస్ట్ ఏసీ కమ్ 2ఏసీ, 2 ఏసీ, 3 ఏసీ, స్లీపర్ క్లాసు, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు కూడా ఉంటాయని ఎస్‌సీఆర్ ఓ ప్రకటనలో వెల్లడించింది.

## ఖమ్మంలో మున్నేరు ఉధృతి..

### జలదిగ్బంధంలో కాలనీలు.. సాయం కోసం బాధితుల ఆర్తనాదాలు



బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో ఖమ్మం జిల్లాలో ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలకు వరదగా వరద పోటెత్తుత్తున్నది. మున్నేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. దాంతో వాగు పరివాహకంలోని 15 కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. రాజీవ్ గృహకల్ప, వెంకటేశ్వర్‌నగర్, మోతీనగర్, బొక్కలగడ్డ కాలనీతో పాటు పలు ప్రాంతాల్లోకి వరద పోటెత్తింది. కాలనీలో నీటమునగడంతో బాధితులు ఇండ్లపైకి చేరుకున్నారు. వరద చుట్టుముట్టడంతో బయటకు వెళ్లేందుకు అవకాశం లేకుండాపోయింది. ఇండ్లపై నుంచే రక్షించాలంటూ వరద బాధితులు ఆర్తనాదాలు చేస్తున్నారు. ఇండ్లపైకి చేరుకొని సహాయం కోసం వందలాది మంది నిరీక్షిస్తున్నారు. ఉదయం నుంచి అల్పాహారం లేకుండా సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. అయితే, అధికారులు సహాయక చర్యలు చేపట్టలేదంటూ పలుచోట్ల బాధితులు ఆందోళన చేపట్టారు. ఎంపీగార్డెన్స్‌లో ఎనిమిది మంది కార్మికులు చిక్కుకుపోయారు. రక్షించాలంటూ సహాయం కోసం కార్మికులు ఎదురుచూస్తున్నారు. మరో వైపు ఏపీ సీఎం చంద్రబాబుతో మంత్రి తుమ్మల మాట్లాడారు. మున్నేరు వరద బాధితుల కోసం హెలికాప్టర్లను పంపాలని కోరారు. కాసేపట్లో మున్నేరు వద్దకు హెలికాప్టర్లు చేరుకోనున్నాయి. అలాగే, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విశాఖ నేవీ అధికారులతో మాట్లాడారు. ఖమ్మం నగరానికి నేవీ హెలికాప్టర్లను పంపాలని విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నం నుంచి కాసేపట్లోనే ఖమ్మానికి హెలికాప్టర్లు చేరుకోనున్నాయి.

## సహాయక చర్యల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం..

## ఖమ్మంలో వరద బాధితుల నిరసన



**హైదరాబాద్ :** భారీ వర్షాల నేపథ్యంలో సహాయక చర్యలలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని వరద బాధితులు ఆందోళన చేట్టారు. ఖమ్మం జిల్లాలో గత రెండు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకుజనజీవనం స్తంభించిపోయింది. ఎడతెరిపిలేపి లేకుండా కురుస్తు్రన వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లు తున్నాయి. చెరువులు, కుంటలు అలుగు దుంకుతున్నాయి. పలు చోట్ల చెట్లు విరిగిపడి, కరెంట్ స్తంభాలు నేలకూడలంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇండ్లు కోల్పోయి ఎంతో మంది నిరాశ్రయులయ్యారు. అయితే ప్రభుత్వం బాధితులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ ఖమ్మం కాలువ ఒడ్డు వద్ద త్రీ టౌన్ ప్రాంత ప్రజలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాగా, భారీ వర్షాల నేపపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకి రావొద్దని అధికారులు హెచ్చరించారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏ అవసరం వచ్చినా అధికారులకు ఫోన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు.

## ములుగు జిల్లాలో గాలివాన బీభత్సం..

## విరిగిన చెట్లు, కూలిన విద్యుత్ స్తంభాలు



**ములుగు :** ములుగు జిల్లాలో గాలివాన బీభత్సం సృష్టించింది. రెండు రోజులుగా ఎడతెరిపిలేపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లు తున్నాయి. చెరువులు, కుంటలు అలుగు దుంకుతున్నాయి. పలు చోట్ల చెట్లు విరిగిపడి, కరెంట్ స్తంభాలు నేలకూడలంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వర్షాలక కారణంగా తాడ్వాయి మండలం మేడారం రోడ్డులో ఆదివారం తెల్లవారుజామున వీచిన భారీ గాలులతో 33 కేవీ ఫీడర్‌కు వెళ్లే 11 కేవీ విద్యుత్తు లైన్లో 16 విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. అదేవిధంగా రెండు కిలోమీటర్ల మేర భారీ వృక్షాలు సైతం నేలకొరిగాయి. విద్యుత్ శాఖ అధికారులు విరిగిపోయిన విద్యుత్ స్తంభాలను పరిశీలించి మరమ్మతు పనులు చేపట్టారు. కాగా, భారీ వర్షాల నేపపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకి రావొద్దని అధికారులు హెచ్చరించారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏ అవసరం వచ్చినా అధికారులకు ఫోన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. వర్షాల కారణంగా రేపు అన్ని విద్యా సంస్థలకు ప్రభుత్వం సెలవును ప్రకటించింది.

## దుందుభి వాగులో చిక్కుకున్న

## ఇద్దరు గొర్ల కాపరులు, 200 గొర్రెలు



**హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లు తున్నాయి. చెరువులు, కుంటలు అలుగు దుంకుతు న్నాయి. పలు చోట్ల చెట్లు విరిగిపడి, కరెంట్ స్తంభాలు నేలకూడలంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. భారీ వర్షాలకు నాగర్ కర్నూల్ జిల్లా తాడూరు మండలం సిరసవాడ వద్ద దుందుభి వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. 200 గొర్లతో సహా ఇద్దరు గొర్ల కాపరులు దుండిభి వాగులో చిక్కుకున్నారు. సమాచారం అందుకున్న జిల్లా కలెక్టర్ బాదవత్ సంతోష్ సహాయక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తాను స్వయంగా బైక్‌పై వెళ్లి సహాయక చర్యలను పరిశీలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా, భారీ వర్షాల నేపపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకి రావొద్దని అధికారులు హెచ్చ రించారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏ అవసరం వచ్చినా అధికా రులకు ఫోన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. వర్షాల కారణంగా రేపు అన్ని విద్యా సంస్థలకు ప్రభుత్వం సెలవును ప్రకటించింది.

బిజినెస్

# ఇన్వెస్టర్లకు గుడ్ న్యూస్..
# 2 షేర్లకు ఒకటి ఉచితం

ప్రభుత్వ సంస్థ (ఇండియా) లిమిటెడ్ బోర్డు 1:2 నిష్పత్తిలో అర్హులైన షేర్‌హోల్డర్లకు బోనస్ షేర్లను జారీ చేయడానికి ఆమోదించింది. దీని కింద కంపెనీ ప్రతి 2వ షేరుపై ఒక బోనస్ షేరును అందిస్తుంది. ఇందుకోసం రూ.90 కోట్ల విలువైన స్టోర్‌ను కంపెనీ వినియోగించుకోనుంది. బోనస్ షేర్ల జారీకి, రికార్డు తేదీని నిర్ణయించేందుకు బోర్డు ఆమోదం తెలిపిందని ఎన్‌బీసీసీ స్టాక్ ఎక్స్ఛేంజీకి తెలిపింది. 1:2 నిష్పత్తిలో కంపెనీ షేర్‌హోల్డర్లకు బోనస్ షేర్‌లను జారీ చేయాలని డైరెక్టర్ల బోర్డు సిఫార్సు చేసింది. అంటే రికార్డ్ తేదీ నాటికి అర్హత కలిగిన సభ్యులు కలిగి ఉన్న ప్రతి రెండు షేర్‌లకు ఒక కొత్త పూర్తిగా పెయిడ్ అప్ ఈక్విటీ షేర్ పొందనున్నారు.

**253% రాబడి**

గత ఒక సంవత్సరంలో షేర్లు పెట్టుబడిదారుల కు 253% బంపర్ రాబడిని ఇచ్చాయి. ఈ నేపథ్యంలో ఏడాదిలోనే షేరు ధర రూ.52 నుంచి రూ.186కి పెరగడం విశేషం. ఈ క్రమంలో 90 కోట్ల షేర్లను బోనస్ షేర్లుగా జారీ చేయాలని కంపెనీ ప్రతిపాదించింది. ఇందుకోసం వచ్చే వార్షిక సర్వసభ్య సమావేశంలో వాటాదారుల ఆమోదం తీసుకోవాల్సి ఉంటుంది. బోర్డు అక్టోబర్ 7, 2024ని రికార్డ్ డేట్‌గా నిర్ణయించింది. ఇక ఎన్‌బీసీసీ షేర్ల గురించి మాట్లాడితే శుక్రవారం 4.29% తగ్గి రూ.186.35కి చేరుకున్నాయి. ఆగస్టు 28, 2024న షేర్ ధర రూ. 209.75 స్థాయికి చేరుకుంది. ఇది ఈ స్టాక్‌లో 52 వారాల గరిష్ట ధర కావడం విశేషం. అంతకుముందు 2023లో ఈ షేరు రూ.51.10 స్థాయికి చేరింది. ఇది ఈ స్టాక్‌లో 52 వారాల కనిష్ట స్థాయి.

**రికార్డ్ డేట్ ఫిక్స్**

బోనస్ షేర్‌లను స్వీకరించడానికి సభ్యుల అర్హతను



నిర్ణయించడానికి బోర్డు సోమవారం అక్టోబర్ 7, 2024ని రికార్డ్ డేట్‌గా నిర్ణయించింది. కంపెనీ మొత్తం 90 కోట్ల ఈక్విటీ షేర్లను జారీ చేయాలని యోచిస్తోంది. వీటిలో ప్రతి దాని ముఖ విలువ రూ. 1 ఉంటుంది. మార్చి 31, 2024 ఆడిట్ చేయబడిన ఆర్థిక నివేదికల ప్రకారం లాభాల నుంచి సృష్టించబడిన ఉచిత నిల్వల నుంచి బోనస్ షేర్లు జారీ చేయబడతాయి. ఈ బోనస్ ఇష్యూకు అవసరమైన ఉచిత రిజర్వ్ మొత్తం రూ. 90 కోట్లు అని, ఇందులో కంపెనీ నిల్వలు, మిగులులో రూ.1,959 కోట్లు బ్యాలెన్స్ కలిగి ఉందని కంపెనీ వెల్లడించింది.

**డివిడెండ్ కూడా**

అంతకుముందు ఎన్‌బీసీసీ 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ. 1 ఈక్విటీ షేరుకు రూ. 0.63 తుది డివిడెండ్ ప్రకటించింది. దీని రికార్డు తేదీని సెప్టెంబర్ 6, 2024గా నిర్ణయించారు. తన వరల్డ్ ట్రేడ్ సెంటర్ డౌన్‌టౌన్ న్యూఢిల్లీలోని నౌరోజీ నగర్, సరోజినీ నగర్‌లో దాదాపు రూ. 14,800 కోట్ల విలువైన 100 శాతం ఆఫీసు, రిటైల్ ఇన్వెంటరీని విక్రయించింది. ఇటీవల ఆగస్టు 14న అనుబంధ సంస్థ (ఇండియా) హర్యానాలోని డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ నుంచి రూ. 528.21 కోట్ల విలువైన ఆర్డర్‌ను అందుకుంది.

## నెలకు రూ.10 వేల పెట్టుబడి.. కోటీశ్వరులు కావాలంటే ఎన్నేళ్లు పడుతుంది?



ప్రతి ఒక్కరూ ధనవంతులు కావాలని కోరుకుంటారు. కానీ కొద్దిమంది మాత్రమే ఈ కలను నెరవేర్చుకుంటారు. ధనవంతులుగా మారడం అంత అసాధ్యమైన పని మాత్రం కాదు. దీని కోసం మీరు తెలివిగా పెట్టుబడి చేస్తే చాలు. ఆ తర్వాత మీ డబ్బు మీమ్మల్ని ధనవంతులు కావడానికి మార్గం సులభం చేస్తుంది. కొద్దికొద్దిగా ఇన్వెస్ట్ చేయడం ద్వారా తక్కువ సమయంలోనే కోటీశ్వరులుగా మారవచ్చు. అయితే అందుకోసం ఎన్నేళ్ల సమయం పడుతుంది, ఎంత పెట్టుబడి చేయాలనే విషయాలను ఇక్కడ తెలుసుకుందాం. తెలివిగా పెట్టుబడి పెట్టడం ద్వారా ఎవరైనా ధనవంతులు కావచ్చు. సంపదను సృష్టించడానికి క్రమశిక్షణ, సహనంతో సరైన వాటిలో పెట్టుబడి చేయాలి. వాటిలో ఒకటి SIP. SIP అంటే సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్. SIP ద్వారా షేర్లలో పెట్టుబడి పెట్టవచ్చు. మీరు రుణం లేదా బంగారం వంటి వస్తువులలో కూడా SIP చేయవచ్చు. వివిధ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు వివిధ రకాల SIP ఎంపికలను అందిస్తున్నాయి. మీరు వాటిలో మీకు ఇష్టమైన దానిని ఎంచుకోవచ్చు. మీ రిస్క్, రాబడిని బట్టి SIPలు ఉంటాయి.

**ఎంత సమయం**

SIPపై రాబడి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. వీటిలో దీర్ఘకాలంలో మంచి రాబడులను పొందవచ్చు. మీ పెట్టుబడిపై నామమాత్రపు రాబడిని పొందడం కూడా ఉంటుంది. దీనిలో సగటు రాబడి 12 నుంచి 17 శాతం వరకు వచ్చే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో మీరు నెలవారీ సిప్ పెట్టుబడి రూ. 10 వేలను 20 ఏళ్లు పెట్టుబడి చేస్తే చేసే మీరు పెట్టేది మొత్తం రూ.24 లక్షలు అవుతుంది. ఆ క్రమంలో 20 ఏళ్ల తర్వాత 15 శాతం వడ్డీ చొప్పును మీకు వచ్చేది మొత్తం రూ.1,51,59,550. మీరు పెట్టుబడి చేసిన 24 లక్షలకు రూ. 1,27,59,550 వడ్డీ కూడా యాడ్ అవుతుంది. ఈ క్రమంలో 20 ఏళ్లలో మీరు మంచి రాబడులను పొందవచ్చు. ఒకవేళ మీరు నెలకు రూ.15 వేలు పెట్టుబడి చేస్తే మీరు 15 ఏళ్లలోనే కోటీశ్వరులు అయ్యే ఛాన్స్ ఉంటుంది.

**ఎలాగైనా ఉపయోగించుకోవచ్చు**

వచ్చిన మొత్తాన్ని మీరు రిటైర్‌మెంట్ ఫండ్‌గా ఉపయోగించుకోవచ్చు. లేదా ఇల్లు లేదా కారు కొనాలనే ప్లాన్ ఉంటే అది కూడా సాధ్యమే. లేదంటే మీ పిల్లల పెళ్లిళ్లు లేదా ఇతర ఖర్చుల కోసం వాడుకోవచ్చు. లేదా ఆ మొత్తాన్ని బ్యాంకులో %ఖీణ% చేసినా మీరు వడ్డీ రూపంలో నెలకు కొంత మొత్తాన్ని పొందవచ్చు. %ూఱూ%లో ఈ అద్భుతమైన రాబడి సమ్మేళనం ద్వారా వస్తుంది. సమ్మేళనం అంటే చక్రవడ్డీ. %ూఱూ%లో పెట్టుబడి పెట్టడం ద్వారా మీరు పెట్టిన మొత్తం క్రమంగా పెరుగుతూనే ఉంటుంది. రాబడులు దానికి యాడ్ అవుతూ ఉంటాయి.

## 15 నెలల కనిష్ఠానికి జీడీపీ.. కారణం అదే

భువనేశ్వర్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో దేశ వృద్ధిరేటు 15 నెలల కనిష్ఠ స్థాయికి పడిపోవడంపై రిజర్వు బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ స్పందించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం పెట్టే ఖర్చుల్లో ప్రతిష్ఠంభన నెలకొనడం వల్లనే వృద్ధిరేటు మందగించిందని ఆయన వ్యాఖ్యానించారు. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో వృద్ధి 7.1 శాతంగా ఉంటుందని రిజర్వు బ్యాంక్ అంచనావేయగా, కానీ 6.7 శాతానికి పరిమితమైంది. వినిమయం, పెట్టుబడులు, తయారీ, సేవలు, నిర్మాణ రంగాలు ఏడు శాతానికి పైగా వృద్ధిని కనబరిచినప్పటికీ మిగతా రంగాల్లో మందకొడి నెలకొన్నదని పేర్కొంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చులు తగ్గించుకోవడం, వ్యవసాయ రంగాల్లో నెలకొన్న మందకొడి పరిస్థితుల కారణంగా దేశ వృద్ధిరేటు తగ్గిందని దాస్ వ్యాఖ్యానించారు. ఎన్నికల నేపథ్యంలో తొలి త్రైమాసికంలో ప్రభుత్వ ఖర్చులు తగ్గినప్పటికీ..వచ్చే త్రైమాసికాల్లో మళ్లీ పెరిగే అవకాశాలున్నాయని, తద్వారా వృద్ధిరేటు పుంజుకుంటుందని ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఏప్రిల్ నుంచి జూన్ మధ్యకాలంలో వ్యవసాయ రంగంలో 2 శాతం మాత్రమే వృద్ధిని సాధించింది. ఈ ఏడాది దేశవ్యాప్తంగా అంచనావేసినదానికంటే వర్షాలు అధికంగా కురియనుండటంతో వ్యవసాయం మెరుగైన వృద్ధి సాధించే అవకాశాలున్నాయని చెప్పారు.

## ఇమామీ చేతికి హీలియోస్ లైఫ్‌ట్కస్టైల్

**న్యూఢిల్లీ :** దేశీయ ఎఫ్ఎంసీజీ దిగ్గజం ఇమామీ..హీలియోస్ లైఫ్‌ట్కస్టైల్‌లో పూర్తిస్థాయి వాటాను కొనుగోలు చేసింది. ఇప్పటికే 50 శాతానికి పైగా వాటా కలిగివున్న ఇమామీ..తాజాగా 49.6 శాతం వాటాను హస్తగతం చేసుకున్నది. దేశంలో అత్యధిక వేగంగా వృద్ధిని నమోదు చేసుకుంటున్న వరుడు దుస్తుల విక్రయ విభాగంలో మరింత పట్టు సాధించాలనే ఉద్దేశంతో హీలియోస్‌ను కొనుగోలు చేసినట్లు కంపెనీ తెలిపింది. 2017లో 33 శాతం వాటా కొనుగోలు చేసిన సంస్థ..ఆ తర్వాతి క్రమంలో ఈ వాటాను 50 శాతానికి పెంచుకున్నది. ప్రస్తుతం మిగతా వాటాను కొనుగోలు చేసింది. స్కిన్‌కేర్, హెయిర్ కేర్, బాడీ కేర్ ఉత్పత్తులను ది మ్యాన్ కంపెనీ పేరుతో విక్రయిస్తున్నది.

# టీ20లకు వెస్టిండీస్ దిగ్గజం వీడ్కోలు



వెస్టిండీస్ లెజెండ్ డ్వేన్ బ్రావో పొట్టి ఫార్మాట్‌కు కూడా వీడ్కోలు పలికాడు. ఇప్పటికే వన్డేలకు, టెస్టులతో పాటు ఐపీఎల్ నుంచి వైదొలిగిన బ్రావో ఫ్రాంచైజీ క్రికెట్‌కు కూడా రిటైర్మెంట్ ప్రకటించాడు. ప్రస్తుతం ఆడుతున్న కరీబియన్ ప్రీమియర్ లీగ్ తన టీ20 కెరీర్‌లో ఆఖరిదని తేల్చేశాడు. ప్రపంచంలోనే మేటి ఆల్‌రౌండర్ అయిన బ్రావో తన వీడ్కోలు నిర్ణయాన్ని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా వెల్లడించాడు. నా క్రికెట్ కెరీర్‌లో ఇది నిజంగా గొప్ప ప్రయాణం అని బ్రావో అన్నాడు. 'ఇది నిజంగా గొప్ప జ్నీ. ఈ రోజుతో కరీబియన్ ప్రీమియర్ లీగ్‌కు కూడా వీడ్కోలు పలుకుతున్నా. ఇదే నా ఆఖరి సీపీఎల్. నా కరీబియన్ జనం ముందు చివరి టోర్నమెంట్ ఆడేందుకు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నా. ఎక్కడైతే నా కెరీర్ మొదలైందో.. అక్కడే కెరీర్ ముగిస్తున్నాను' అని బ్రావో తన పోస్ట్‌లో రాసుకొచ్చాడు.

ప్రస్తుతం సీపీఎల్‌లో బ్రావో ట్రిన్‌బగో నైట్ రైడర్స్ జట్టుకు ఆడుతున్నాడు. వెస్టిండీస్ తరఫున రెండు టీ20 వరల్డ్ కప్‌లు గెలుపొందిన బ్రావో ఐపీఎల్‌లో అదరగొట్టాడు. ముంబై ఇండియన్స్ చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీలకు ఆడిన అతడు అత్యధిక వికెట్ల వీరుడిగా పేరొందాడు. అయితే.. తన సుదీర్ఘ ఐపీఎల్ కెరీర్‌కు బ్రావో 2023లో వీడ్కోలు పలికాడు.

**ఎంఎస్ ధోనీతో బ్రావో**

ఐపీఎల్‌లో ఈ వెటరన్ ఆల్‌రౌండర్ 161 మ్యాచ్‌లు ఆడి.. 183 వికెట్లు తీశాడు. 1,560 రన్స్ చేశాడు. ఈ లీగ్‌లో అతను 5 అర్ధ సెంచరీలు ఉన్నాయి. రిటైర్మెంట్ తర్వాత బ్రావో చెన్నై సూపర్ కింగ్స్ బౌలింగ్ కోచ్‌గా నియమితులయ్యాడు. ప్రస్తుతం బ్రావో అఫ్గనిస్థాన్ జట్టు బౌలింగ్ కోచ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న విషయం

# రోహిత్ చాలా తెలివైన క్రికెటర్..
# అతడికి అంపైరింగ్ తేలిక

భారత కెప్టెన్ రోహిత్ శర్మ క్రీజులో ఉంటే ప్రత్యర్థి బౌలర్లకు హడలే. కాలు కదపకుండానే అలవోకగా భారీ సిక్సర్లు కొట్టే హిట్‌మ్యాన్.. ఫుల్‌షాట్ ఆడాడానుకో ఆ బంతి ఇక స్టాండ్స్‌లోకే. ఈ మధ్యే టీమిండియాను పొట్టి ప్రపంచ కప్ చాంపియన్‌గా నిలిపిన రోహిత్‌పై అంపైర్ అనిల్ చౌదురీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. రోహిత్ శర్మ చాలా తెలివైన క్రికెటర్ అని, అతడికి క్రికెట్ 'ఐక్యూ' చాలా ఎక్కువని అనిల్ వెల్లడించాడు. అంతర్జాతీయ క్రికెట్ మండలి అంపైరింగ్ ప్యానెల్‌లో ఒకడైమన అనిల్ చౌదరీ తాజాగా పోడ్‌కాస్ట్‌లో మాట్లాడాడు. తన అంపైరింగ్ కెరీర్ గురించి.. మైదానంలో తాను చూసిన గొప్ప ఆటగాళ్ల గురించి చెప్పిన ఆయన రోహిత్ శర్మను ఆకాశానికెత్తేశాడు. 'మనకు మైదానంలో రోహిత్ ప్రశాంతంగా ఉన్నట్టు కనిపిస్తాడు. కానీ, అతడు చాలా తెలివైన క్రికెటర్. అవును.. అతడు చాలా స్మార్ట్. అతడి క్రికెట్ ఐక్యూ చాలా ఎక్కువ' అని అన్నాడు. అంతేకాదు రోహిత్ బ్యాటింగ్ చేసేటప్పుడు అతడి ఆలోచనా శక్తిని



అంచనా వేయడం చాలా కష్టమని అనిల్ తెలిపాడు.

**కచ్చితత్వంతో షాట్లు**

'రోహిత్ బ్యాటింగ్ చేస్తుంటే ఒక బౌలర్ గంటకు 120 కిలోమీటర్ల వేగంతో బంతిని విసిరినట్టు అనిపిస్తుంది. అతడు కచ్చితత్వంతో షాట్లు ఆడుతాడు. ఏమాత్రం కంగారుపడడు. అందుకని అతడికి అంపైరింగ చేయడం చాలా తేలిక. మరోవిషయం.. రోహిత్ చాలా అప్పీల్స్‌లో భాగమవుతాడు. 'ఔట్ అని అనుకుంటున్నా' అని తన నిర్ణయాన్ని చెప్పేస్తాడు. చూడ్డానికి మనందరికీ హిట్‌మ్యాన్ సరదాగా కనిపిస్తాడు. కానీ, అతడు మనం అనుకునేంత సరదా మనిషి మాత్రం కాదు' అని అనిల్ వెల్లడించాడు.

వన్డేల్లో రోహిత్ డబుల్ సెంచరీ కొట్టిన రోజును కూడా ఈ సందర్భంగా అనిల్ గుర్తు చేసుకున్నాడు. అప్పుడు నేను టీవీ అంపైర్‌గా ఉన్నాను. కోల్‌కతాలో అనుకుంటా అతడు రెండొందలు కొట్టాడు. ఆ మ్యాచ్‌లో మిగతా భారత ఆటగాళ్లకు యార్కర్లు అనిపిస్తుంటే.. అతడు మాత్రం అలవోకగా సిక్సర్లు బాదేస్తున్నాడు. అతడు నిజంగా ఓ ప్రత్యేక ఆటగాడు. రోహిత్ కొంచెం బద్ధకస్తుడే. కానీ, ఆటపై అతడికి ఉన్న అవగాహన అమోఘం' అని అనిల్ చెప్పాడు. 2021లో అనిల్ ఆన్ ఫీల్డ్ అంపైరింగ్ కెరీర్ మొదలైంది. ఇప్పటివరకూ ఆయన 4 టెస్టులు, 26 వన్డేలు, 44 టీ20లకు అంపైరింగ్ చేశాడు. ఏ ప్లస్ అంపైర్ అయిన అనిల్‌కు ఐసీసీ ఒక్కో మ్యాచ్‌కు రూ.40 వేలు చెల్లిస్తోంది

స్పోర్ట్స్

## అతడికి నేను పెద్ద అన్న లేదా సహచరుడు

**కోహ్లీతో అనుబంధంపై ధోనీ కామెంట్స్**



భారత క్రికెట్‌పై చెరగని ముద్ర వేసిన వాళ్లు చాలామందే. ఈ కాలంలో చూస్తే.. మహేంద్ర సింగ్ ధోనీ విరాట్ కోహ్లీలు సహచరులుగా. సారథులుగా టీమిండియాను అగ్రస్థానాన నిలిపారు. వీళ్లిద్దరూ దేశం గర్వించదగ్గ కెప్టెన్లు మాత్రమే కాదండోయ్ అత్యంత సన్నిహితులు కూడా. ధోనీపై తన ఆరాధన భావాన్ని కోహ్లీ పలు సందర్భాల్లో వెల్లడించాడు. తాజాగా కోహ్లీతో బంధంపై ధోనీ తాజాగా స్పందించాడు. 'మేమిద్దరం 2008-09 నుంచి కలిసి ఆడుతున్నాం. మా మాధ్య వయసు అంతరం నిజమే. అందుకని నేను విరాట్‌కు నేను ఏమి అవుతాను? అంటే ఫలానా అని కచ్చితంగా చెప్పలేను. అతడికి నేను పెద్ద అన్న లేదా సహచరుడు.. ఇలా మా అనుబంధానికి మీరు ఏ పేరైనా పెట్టుకోవచ్చు. కానీ, ఫలానా అని మాత్రం చెప్పేలేను. మేమిద్దరం దేశం తరఫున చాలా ఏండ్లు ఆడాం. ప్రపంచ క్రికెట్‌లో విరాట్ అత్యుత్తమ ఆటగాడు' అని ధోనీ వెల్లడించాడు. ధోనీ కెప్టెన్సీలో రాటుదేలిన విరాట్ చివరకు అతడి నుంచే సారథిగా పగ్గాలు అందుకున్నాడు. ధోనీతో కలిసి 2011 వరల్డ్ కప్, 2013 చాంపియన్స్ ట్రోఫీ విజయంలో కోహ్లీ భాగమయ్యాడు. 2019 వరల్డ్ కప్ తర్వాత ధోనీ వీడ్కోలు పలకగా.. కోహ్లీ భారత కెప్టెన్‌గా శిఖరాలకు చేరాడు. అంతేకాదు టీమిండియాకు ఆడినన్ని రోజులకే పరిమితం కాకుండా.. ఆ తర్వాత కూడా మహీతో అనుబంధాన్ని కొనసాగించాడు. ప్రస్తుతం ఇద్దరూ ఐపీఎల్‌లో తమదైన ఆటతో ఫ్యాన్స్‌ను అలరిస్తున్నారు. చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఐదు టైటిళ్లు గెలుపొందగా.. కోహ్లీ మాత్రం ఒక్కసారి కూడా ట్రోఫీని ముద్దాడలేకపోయాడు.

# 'కాంతార' ప్రీక్వెల్‌లో జూ.ఎన్టీఆర్?



టాలీవుడ్ అగ్ర కథానాయకుడు జూ.ఎన్టీఆర్ ప్రస్తుతం కర్ణాటక పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే. ఫ్యామిలీతో కలిసి మంగళూరు వెళ్లిన తారక్.. అక్కడ ఉన్న ప్రముఖ దేవాలయాలను సందర్శిస్తున్నారు. శనివారం నాడు ఉడిపిలోని శ్రీకృష్ణ మఠంను దర్శించుకున్న తారక్ ఆదివారం కొల్లురులోని మూకాంబిక అమ్మవారి ఆలయానికి వెళ్లారు. కాంతార నటుడు రిషబ్ శెట్టితో కలిసి ఉదయం పంచెకట్టులో ఆలయానికి వెళ్లిన తారక్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అయితే దర్శనం అనంతరం ఆలయం నుంచి బయటకు వస్తూ మీడియాతో ముచ్చటించారు తారక్. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రిషబ్ శెట్టితో కలిసి శ్రీకృష్ణ మఠం, మూకాంబిక అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉంది. ఇటువంటి దివ్యమైన ప్రదేశంలో సినిమాల అప్‌డేట్‌ల గురించి స్పందించాలని లేదు అంటూ వెల్లడించాడు. అయితే ఒక రిపోర్టర్ అడుగుతూ.. కాంతార ప్రీక్వెల్‌లో మీరు నటిస్తున్నారు అని వార్తలు వస్తున్నాయి అందులో నిజం ఎంత అని అడుగగా.. తారక్ చెబుతూ.. రిషబ్ షెట్టి అలాంటివి ప్లాన్ చేయాలి. ఆయన ప్లాన్ చేస్తే చేయడానికి నేను రెడీగా ఉన్నా అంటూ తారక్ చెప్పుకోచ్చాడు.



# మంచి ప్యామిలీ ఎంటర్‌టైనర్

## 'మారుతి నగర్ సుబ్రమణ్యం'పై సూపర్ స్టార్ మహేష్ బాబు

తొలిసారి రావు రమేష్ ప్రధాన పాత్రలో నటించిన హిలేరియస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం 'మారుతి నగర్ సుబ్రమణ్యం'. ప్రేక్షకుల నుంచి పాజిటివ్ టాక్‌ని సొంతం చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శింపబడుతోంది. ఇటువంటి వినోదాత్మక సినిమా తీసినందుకు 'మారుతి నగర్ సుబ్రమణ్యం' చిత్ర బృందాన్ని సూపర్ స్టార్ మహేష్ బాబు అభినందించారు. చిత్ర బృందం మీద ప్రశంసలు కురిపించారు. మంచి సినిమాలకు మద్దతు ఇవ్వడంలో సూపర్ స్టార్ మహేష్ బాబు ఎప్పుడూ ఓ అడుగు ముందుంటారు. సినిమాలో ఆయనకు నచ్చిన విషయాలు చెప్పడంతో పాటు తన అభిప్రాయాన్ని వెల్లడిస్తూ ఉంటారు. ఇప్పుడు 'మారుతి నగర్ సుబ్రమణ్యం' సినిమాకు కూడా మహేష్ బాబు రివ్యూ ఇచ్చారు. ఈ మధ్య కాలంలో వచ్చిన మంచి వినోదాత్మక చిత్రాల్లో 'మారుతి నగర్ సుబ్రమణ్యం' ఒకటని సూపర్ స్టార్ మహేష్ బాబు తెలిపారు. 'హిలేరియస్ రైడ్' అంటూ సినిమాకు షార్ట్ అండ్ స్వీట్ ట్యాగ్‌లైన్ ఇచ్చారు. తన ట్వీట్‌లో సమర్పకురాలు తబితా సుకుమార్, చిత్ర బృందానికి శుభాకాంక్షలు చెప్పారు. మహేష్ ట్వీట్ చూస్తే... ఆయన సినిమాను చాలా ఎంజాయ్ చేసినట్టు అర్థం అవుతోంది. ఆయన ప్రశంసలతో 'మారుతి నగర్ సుబ్రమణ్యం' చిత్ర బృందం అమితానందంలో ఉంది. లక్ష్మణ్ కార్య దర్శకత్వం వహించిన ఈ సినిమా తబితా సుకుమార్ సమర్పణలో విడుదలైంది. కుటుంబ ప్రేక్షకులతో పాటు యువతరం సైతం ఈ సినిమాను ఎంజాయ్ చేస్తోంది. థియేటర్లలో నవ్వుల పండగ స్పష్టంగా కనబడుతోంది. ఈ చిత్రాన్ని పీబీఆర్ సినిమాస్, లోకమాత్రే సినిమాటిక్ సంస్థలపై బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మించారు.

# అంతిమంగా సినిమా బతకాలి..

## హేమ కమిటీ రిపోర్ట్‌పై స్పందించిన మమ్ముట్టి




మలయాళం సినీ ఇండస్ట్రీ ప్రస్తుతం కాస్టింగ్ కౌచ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. మలయాళ ఇండస్ట్రీలో మహిళలపై జరుగుతోన్న వేధింపులపై కేరళ ప్రభుత్వం జస్టిస్ హేమ కమిటీని ఏర్పాటు చేయగా.. ఈ కమిటీ సిద్ధం చేసిన రిపోర్ట్ ఆ పరిశ్రమను కుదిపేస్తోంది. అయితే ఈ కమిటీ ఇచ్చిన రిపోర్ట్‌పై తాజాగా మెగాస్టార్ మమ్ముట్టి స్పందించాడు. ఈ పోస్ట్ మలయాళ సినిమా ప్రస్తుతం ఎదుర్కొంటున్న పరిస్థితుల ఆధారంగా చేసింది. ఇన్ని రోజులు ఈ ఘటనపై స్పందించకపోవడానికి కారణం. ఆరోపణలు ఎదుర్కొంటున్న నటీనటులు, అండగా ఉండే అసోసియేషన్ స్పందించాలి. నేను కూడా నటుడిగా నా అభిప్రాయాన్ని తెలియజేయాలని అనుకున్నాను. సినిమా అనేది సమాజానికి ప్రతిరూపం. సమాజంలోని మంచి చెడులన్నీ సినిమాలో ఉంటాయి. సినిమా పరిశ్రమ అంటే సమాజం చాలా శ్రద్ధ చూపుతుంది. అందుకే అక్కడ జరిగే చిన్న సమస్య అయిన పెద్దగా కనిపిస్తుంది. ఈ రంగంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చిత్ర నిర్మాతలు జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలి. ఎన్నడూ జరగకూడనిది ఘటనలు ఏదైనా జరిగిన తర్వాత సినిమా పరిశ్రమను అధ్యయనం చేసి, పరిష్కారాలను సూచించడానికి, అలాగే చర్యలను చేపట్టడానికి ఒక నివేదికను సిద్ధం చేయడానికి ప్రభుత్వం జస్టిస్ హేమ కమిటీని ఏర్పాటు చేసింది. హేమ కమిటీని నివేదికలో వివరించిన సిఫార్సులు మరియు పరిష్కారాలను మేము హృదయపూర్వకంగా స్వాగతిస్తాము అలాగే మద్దతు ఇస్తున్నాము. వాటిని అమలు చేసేందుకు సినీ పరిశ్రమలోని అన్ని సంఘాలు తేడా లేకుండా చేతులు కలపాల్సిన సమయం ఆసన్నమైంది. వచ్చిన ఫిర్యాదులపై పోలీసుల విచారణ ముమ్మరంగా సాగుతోంది. జస్టిస్ హేమ కమిటీ నివేదిక పూర్తి వెర్షన్ కోర్టు ముందు ఉంది. పోలీసులు నిజాయితీగా విచారణ చేయనివ్వండి. శిక్షలను కోర్టు నిర్ణయించనివ్వండి. సినిమాలో 'పవర్‌హౌస్' అనేదే లేదు. సినిమా అంటే అలాంటివి ఉండే ఫీల్డ్ కాదు. కమిటీ నివేదికలోని ఆచరణాత్మక సిఫార్సులను అమలు చేయాలని, చట్టపరమైన అడ్డంకులు ఉంటే అవసరమైన చట్టాన్ని రూపొందించాలని జస్టిస్ హేమ అభ్యర్థించారు. అంతిమంగా సినిమా బతకాలి అంటూ మమ్ముట్టి రాసుకోచ్చాడు.

# వెన్నులో వణుకు పుట్టింది .. కాన్సెర్ట్ క్యాన్సిల్ చేశా



కోల్‌కతా జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటన గురించి తెలిశాక తన వెన్నులో వణుకు పుట్టిందని గాయని శ్రేయా ఘోషల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన నేపథ్యంలో ఆ నగరంలో జరగాల్సిన తన కాన్సర్ట్‌ను వాయిదా వేసుకున్నారు. ఈవిషయాన్ని తెలుపుతూ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. ప్రపంచవ్యాప్తంగా మహిళల రక్షణ కోసం ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. 'ఇటీవల కోల్‌కతాలో జరిగిన భయంకరమైన, హేయమైన సంఘటనతో నేను చాలా బాధపడ్డాను. అది నాపై తీవ్ర ప్రభావం చూపింది. అది పూర్తిగా క్రూరమైన చర్య. ఆ విషయం తెలిశాక నా వెన్నులో వణుకు పుట్టింది. సిటీలో సెప్టెంబర్‌లో జరగాల్సిన నా సంగీత విభావరిని వాయిదా వేసుకుంటున్నా. త్వరలోనే కొత్త తేదీని ప్రకటిస్తాను. ఈ కచేరీ సంగీత ప్రియులకు ఎంతో అవసరం. కానీ దానికంటే మహిళల గౌరవం, వారి భద్రత కోసం నేను ప్రార్థిస్తున్నాను. అందుకే ఈ షోను వాయిదా వేస్తున్నా. నా నిర్ణయాన్ని మీరంతా అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నా" అని ట్వీట్‌లో పేర్కొన్నారు. పశ్చిమబెంగాల్‌లో జరిగిన ఘటన దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. బాధితురాలికి న్యాయం చేయాలని కోరుతూ నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కేసులో నిందితుడికి న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది.




# సెప్టెంబర్ 7న భలే ఉన్నాడే!

టాలీవుడ్ యువ కథానాయకుడు ఈ ఏడాది వరుస సినిమాలతో దూసుకుపోతున్నాడు. ఇప్పటికే 'నా సామి రంగా', 'పురుషోత్తముడు', తిరగబడరసామి అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ కుర్ర హీరో మరో సినిమాను విడుదలకు రెడీ చేశాడు. రాజ్‌తరుణ్ కథానాయకుడిగా జె.శివసాయివర్ధన్ దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం 'భలే ఉన్నాడే!'. ఈ సినిమాలో మనీషా కంద్కూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. మారుతి టీమ్ ప్రొడక్ట్ సంస్థ సమర్పిస్తోంది. ఎన్వీ కిరణ్ కుమార్ నిర్మాత. ఇప్పటికే ఈ మూవీ ఫస్ట్ లుక్‌తో పాటు గ్లింప్స్ విడుదల చేసిన చిత్రబృందం తాజాగా విడుదల తేదీని ప్రకటించింది. ఈ సినిమాను మొదట వినాయక చవితి కానుకగా సెప్టెంబర్ 07న విడుదల చేయనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఆరోజు విజయ్ గోట్ విడుదల కానుడటంతో విడుదల తేదీని వాయిదా వేస్తూ.. కొత్త విడుదల తేదీని ప్రకటించింది. ఈ సినిమాను సెప్టెంబర్ 13న విడుదల చేయనున్నట్లు తాజాగా ప్రకటించింది. 'పురుషోత్తముడు', తిరగబడరాసామి వచ్చి రెండు నెలలు కూడా అవ్వట్లేదు అంతలోనే మరో సినిమాను విడుదలకు రెడీ చేశాడు రాజ్ తరుణ్. ఇక ఈ సినిమాతోనైనా రాజ్ హిట్ కొడతాడేమో చూడాలి. ఈ చిత్రంలో రాజ్ తరుణ్ టైలర్ పాత్రలో నటిస్తుండగా.. సీనియర్ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు.

PMR Publication,Thurkayamjal 4-136/12, 9100900918